Abdul Kalam
Proprietor
AUTO ELECTRICAL ASSOCIATION
President
EXIDE
AUTHORISED DEALER
SALES & SERVICE
Kalam
BATTERY WORKS
Service for any Car, Lorry, Inverter Battery & Inverter
Plot No. 42, 43, 100 Feet Road,
Jawahar Autonagar, VIJAYAWADA - 520 007.
Contact for Service : 7993382535
INDIA MOVES ON EXIDE

Truth of News
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

శుక్రవారం, 26 జులై 2024 | విజయవాడ | సంపుటి 1 | సంచిక 48 | పేజీలు 8+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

## ఎపిలో ఐదేళ్లపాటు జగన్
# అరాచకం

## కక్షసాధింపుతో విపక్ష నేతలపై కేసులు

నిరాఘాటంగా అరాచక, విధ్వంస పాలన
యధేచ్ఛగా హత్యలు, అత్యాచారాలు, దాడులు, దోపిడీలు
బాధితుల్లో కోడెల, రఘురామ, పవన్,అచ్చెన్న, అయ్యన్న,అనిత
రఘురామ టార్చర్ చూసి జగన్ పైశాచికానందం
అసెంబ్లీ వేదికగా అక్రమ వేధింపు కేసుల చిట్టా విడుదల
శాంతిభద్రతలపై శ్వేతపత్రం విడుదల చేసిన సిఎం చంద్రబాబు



అమరావతి,జూలై25(సూర్య వాస్తవం):
హింస, నేరప్రవృతి గల జగన్ లాంటి వ్యక్తులకు రాజకీయాల్లో అర్హత లేదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మెరుగైన సమాజం రావాలంటే మంచి రాజకీయ వేత్తలు అధికారంలో ఉండాలని వెల్లడించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల నాలుగోరోజున ఆయన అసెంబ్లీ లో శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచక , విధ్వంస పాలన కొనసాగిందని, శాంతి భద్రతలు కరువయ్యాయని అన్నారు. ఈ సందర్భంగా ఐదేండ్ల వైఎస్ జగన్ పాలనలో జరిగిన హత్యలు, అత్యాచారాలు, దాడులు, దోపిడీలు, నేరాలకు సంబంధించిన అంశాలను చంద్రబాబు స్లైడ్‌ల ద్వారా వివరించారు. ప్రజాప్రతినిధులను కూడా ఎవరిని వదలలేదని ఆరోపించారు. జగన్ హయాంలో కేసులకు గురైన వారిని ఎన్నికల్లో గెలిపించి అసెంబ్లీకి పెద్ద సంఖ్యలో పంపించారని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులందరిపైన కేసులు పెట్టి హింసించారని తెలిపారు.కోడెల శివప్రసాద్ ,

## ఆర్థిక అవకతవకలపై నేడు శ్వేతపత్రం

**ప్రజల ముందు వివరాల వెల్లడి**
**సిఎం చంద్రబాబు**

అమరావతి,జూలై25 (సూర్య వాస్తవం):
ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ఆదాయం, అప్పుల వివరాలను ప్రజల ముందుంచేందుకు సీఎం సిద్ధమయ్యారు. శుక్రవారం శాసనసభలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై లోతుగా అధ్యయనం చేసిన కూటమి ప్రభుత్వం 2019–24 మధ్య పెండింగ్ బిల్లులు రూ.1,41,588 కోట్లు ఉన్నట్లు గుర్తించింది. ఉద్యోగులు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు రూ.వేల కోట్లు ఉన్నట్టు తేల్చింది. పెండింగ్ బిల్లుల్లో రూ.93వేల కోట్లు సీఎఫ్ఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేయలేదని, రూ.48వేల కోట్లు మేర బిల్లులు అప్‌లోడ్ చేసినా చెల్లింపులు చేయలేదని నిర్ధరించింది. భారీగా నీటిపారుదలశాఖ, పోలవరం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వివిధ ప్రాజెక్టులకు మిగతా 2లో..

## శాంతిభద్రతల్లో రోల్ మోడల్‌గా ఎపి

ప్రజలకు భద్రత కలిగించేలా చర్యలు
విస్తృత చర్చ చేపట్టి నిర్ణయాలు తీసుకోవాలి
అసెంబ్లీలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



అమరావతి,జూలై25(సూర్య వాస్తవం):
ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతల పర్యవేక్షణపై ప్రత్యేక చర్చ పెట్టాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోరారు. ఏపీ అసెంబ్లీ సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ మీద లోతైన చర్చ జరగాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించాలని కోరారు.శాంతి భద్రతల పై ప్రభుత్వం తీసుకునే భవిష్యత్ ప్రణాళిక , చట్టం అంటూ భయం వచ్చే విధంగా ఉండాలని పేర్కొన్నారు. చర్చల్లో సభ్యులందరి సూచనలు తీసుకొని 5కోట్ల మంది ప్రజల భద్రత కలిగించేలా ఉండాలని అన్నారు. భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ శాంతి భద్రతల్లో తలమానికంగా ఉండేలా విస్తృతస్థాయి చర్చ జరిగి విధి, విధానాల రూపకల్పన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ వచ్చే బ్జడెట్ సమావేశాల మిగతా 2లో..

## సుప్రీం ఆదేశాలతో నీట్ తుది ఫలితాల వెల్లడి

61నుంచి 17కు తగ్గిన టాప్‌ర్యాంకర్ల సంఖ్య
వెబ్‌సైట్‌లో ఫలితాలను విడుదలచేసిన ఎన్‌టిఎ



న్యూఢిల్లీ,జూలై25(సూర్య వాస్తవం):
నీట్ యూజీ 2024 పరీక్ష వివాదం వేళ ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఫిజిక్స్ విభాగంలోని ఓ ప్రశ్నకు ఒకటే సమాధానం ఉంటుందని నిపుణుల కమిటీ తేల్చడంతో దాని ఆధారంగా ఫలితాలను సవరించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పరీక్ష తుది ఫలితాలను ఎన్‌టీఏ గురువారం విడుదల చేసింది. ఇందులో 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులను కోల్పోయారు. దీంతో టాప్ ర్యాంక్ సాధించిన వారి సంఖ్య కూడా 61 నుంచి 17కు తగ్గింది. సవరించిన ఫలితాలను విద్యార్థులు ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో మిగతా 2లో..

## మహారాష్ట్రకు భారీ వర్ష హెచ్చరిక

ఐఎండి హెచ్చరికలతో పుణెలో పాఠశాలల మూసివేత

ముంబయి,జూలై25(సూర్య వాస్తవం):
మహారాష్ట్రను వర్షాలు ముంచెత్తుతున్నాయి. గురువారం భారీ వర్షాలు కురిసే అవకాశం వుండటంతో భారత వాతావరణ శాఖ మహారాష్ట్రకు, పూణెలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండి హెచ్చరికల మేరకు పూణెలోని పింపి, చించ్వాడ్, భోర్, వెల్హా, మావల్, ముల్షీ, హవేలా, ఖడక్వాస్లా ప్రాంతాల్లోని పాఠశాలలను మూసివేయాలని జిల్లా మెజిస్ట్రేట్ సుహాస్ దివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లాలని ఆయన మిగతా 2లో..



## విజయతీరాలకు అడుగులు

## అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి

గత ప్రభుత్వ విధ్వంసం నుంచి విజయతీరాలకు
ఆర్థికలోటు నుంచి కోలుకునే దిశగా అడుగులు
వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ కేటాయింపులు
ఆర్థికలోటు అంచనా రూ.49,255.41 కోట్లు
ప్రాథమిక లోటు అంచనా రూ.31,525.63 కోట్లు
రెవెన్యూ మిగులు అంచనా రూ.297.42 కోట్లు
వ్యవసాయానికి రూ.72,659 కోట్లు
ఉద్యానశాఖకు రూ.737కోట్లు
పశుసంవర్ధశాఖకు రూ.1,980కోట్లు
రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి రూ. 723కోట్లు
గృహజ్యోతికి రూ.2,418కోట్లు
ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.3836కోట్లు
పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.29,816 కోట్లు
రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు రూ.1,525 కోట్లు
స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 2,736 కోట్లు
ఎస్సీ సంక్షేమం రూ.33,124కోట్లు
ఎస్టీ సంక్షేమం రూ.17,056కోట్లు
మైనార్టీ సంక్షేమం రూ.3,003కోట్లు
బీసీ సంక్షేమం రూ.9,200 కోట్లు
వైద్య, ఆరోగ్యం రూ. 11,468 కోట్లు
ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు
అడవులు, పర్యావరణం రూ.1,064 కోట్లు
పరిశ్రమల శాఖకు రూ. 2,762 కోట్లు
ఐటీ శాఖకు రూ.774 కోట్లు
నీటిపారుదల రంగానికి రూ.22,301 కోట్లు
విద్యకు రూ.21,292 కోట్లు
హోంశాఖకు రూ.9,564కోట్లు
రోడ్లు, భవనాల శాఖకు రూ.5,790 కోట్లు

హైదరాబాద్,జూలై25(సూర్య వాస్తవం):
అభివృద్ధి, సంక్షేమ రంగాలను పరుగు పెట్టించేలా..వ్యవసాయాన్ని గాడిలో పెట్టించేలా...అనేక రంగాలను భ్రష్టు పట్టించి, అప్పులు చేసిన తెలంగాణను తలెత్తుకునేలా చేసేలా...కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి వార్షిక బడ్జెట్‌ను మిగతా 2లో..



## కొత్త టర్న్ తీసుకోబోతున్న
# జగన్ రాజకీయం

## ఇండియాకూటమిలో చేరిక దిశగా అడుగులు

అనివార్యంగా కాంగ్రెస్ వెంట నడవక తప్పనిస్థితి
ఢిల్లీ ధర్నాతో ఇండియా కూటమికి మరింత చేరువ



అమరావతి,జూలై25(సూర్య వాస్తవం):
ఇండియా కూటమిలో చేరాలని జగన్మోహన్ రెడ్డిని సంఘీభావం తెలియచేయడానికి వచ్చిన పార్టీల నేతలంతా ఆహ్వానించారు. దీనిపై జగన్ స్పందన ఏమిటన్నదానిపై స్పష్టత లేదు కానీ ఆయన గతంలోలా బీజేపీకి మద్దతు పలికే అవకాశం లేదు. 2014 నుంచి జగన్ బీజేపీకి మద్దతుగానే ఉన్నారు. 2014లో ఎన్డీఏ కూటమిలో టీడీపీ ఉన్నప్పటికీ ఆయన పరోక్షంగా బీజేపీతో సంబంధాలు కొనసాగించారు. ఈ కారణంగా బీజేపీ, టీడీపీ మధ్య అభిప్రాయభేదాలు వచ్చి .. చంద్రబాబు కూటమి నుంచి బయటకు వచ్చారు. చంద్రబాబు బీజేపీకి పరోక్షంగా పూర్తి స్థాయిలో మద్దతుగా ఉండగలరు కానీ బీజేపీతో పొత్తులు పెట్టుకోలేరు. ఎందుకంటే ఆయన ఓటు బ్యాంక్ పూర్తిగా దళిత, ముస్లింలు, బీజేపీతో పరోక్షంగా స్నేహాన్ని మరో ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల వారు సమర్థించి ఓట్లు వేసి ఉండవచ్చు కానీ నేరుగా పొత్తులు పెట్టుకుంటే మాత్రం ఓటు వేయరు. అందుకే నేరుగా ఎన్డీఏ కూటమిలో చేరేందుకు ఆయన వెనుకాడారు. ఇప్పుడు ఇండీ కూటమికి దగ్గరవుతుతున్నారు. ఇండీ కూటమి ఆయనకు ఓటు బ్యాంక్ పరంగా సేఫ్. కానీ బీజేపీని కాదంటే జరగబోయే పరిణామాల్ని ఎదుర్కోవడం కష్టమని ఇంత కాలం ఆయన ఆ పార్టీ పట్ల భయభక్తులతో ఉన్నారని అనుకోవచ్చు. కానీ ఢిల్లీ ధర్నా తర్వాత ఆయన అనివార్యంగా ఇండియా కూటమితో మిగతా 2లో..

వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో చేపట్టిన ధర్నా రాజకీయంగా కొత్త టర్న్ తీసుకుంటుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ కూటమికి జగన్ దగ్గరవుతున్నారనడానికి ఢిల్లీ ధర్నా రుజువు చేయబోతున్నారు. ఇప్పుడున్న పరిస్థితిఉల్లో బిజెపి లేదా కాంగ్రెస్ కూటామిల్లో ఏదో ఒకదాంట్లో ఉండని పరిస్థితి ఏర్పడింది. బిజెపి కూటమిలో చంద్రబాబు చేరారు కనుక జగన్ కాంగ్రెస్ కూటమిలో అనివార్యంగా చేరాల్సిందే. రాజకీయంగా మనుగడ సాగించాలంటే ఇది తప్పదు. ధర్నాకు ఇండీ కూటమి నేతలంతా ఏకపక్షంగా మద్దతు పలికారు. షర్మిల ఫీల్ అవుతుందనో మరో కారణమో కానీ కాంగ్రెస్ నుంచి మాత్రం ఎవరూ రాలేదు. కానీ కూటమి నుంచి నేతలంతా వచ్చారంటే.. వ్యూహాత్మకమేనని అనుకోవచ్చు. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ముందు మరో దారి లేదు. ఆయన ఖచ్చితంగా ఇండీ కూటమి దారిలో వెళ్లాలి. బీజేపీకి మద్దతుగా ఇక ఎంత మాత్రం ఉండే అవకాశం లేదు. ఎందుకంటే .. కష్టాల్లో ఇంతగా మద్దతుగా ఉన్న ఇండీ కూటమిని కాదని బీజేపీ దగ్గరకు వస్తే అటు బీజేపీ అనుమానిస్తుంది.. ఇటు కాంగ్రెస్ కూటమి ఆగ్రహిస్తుంది. అందుకే జగన్ అన్నీ ఆలోచించుకునే ఇండీ కూటమి నేతల్ని ధర్నాకు మద్దతుగా ఉండాలని ఆహ్వానించినట్లుగా భావిస్తున్నారు.

## విశాఖ పాలిటెక్నిక్‌లో మరుగుదొడ్ల సమస్య

చర్యలు తీసుకోవాలన్న బిజెపి ఎమ్మెల్యే
సమస్యలు లేకుండా చూస్తామన్న మంత్రి లోకేశ్

అమరావతి,జూలై25(సూర్య వాస్తవం):
ఏపీ అసెంబ్లీ సమావేశాలు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. సభ మొదలవగానే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభించారు. విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజీలో మరుగుదొడ్లపై బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు మాట్లాడారు. విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజీలో సరిపడా మరుగుదొడ్లు ఉన్నాయా అంటే మంత్రి ఉన్నాయని అంటున్నారని.. అయితే పరిస్థితులు వేరుగా ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వాన్ని తాను దుర్మార్గపు ప్రభుత్వం అన్నందుకు జైలులో పెట్టారని, ఇప్పుడు బెయిల్‌పై ఉన్నట్లు చెప్పారు. తన నియోజకవర్గంలో ఉన్న పాలిటెక్నిక్ మిగతా 2లో..

## వెంకయ్య చౌదరి నియామాకానికి ఆమోదం

తిరుమల,జూలై25(సూర్య వాస్తవం):
తిరుమల, తిరుపతి దేవస్థానం అదనపు ఈవోగా ఐఆర్ఎస్ అధికారి వెంకయ్య చౌదరిని నియమించారు. ఈ మేరకు గురువారం ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చిన వెంకయ్య చౌదరిని ఏపీ కేడర్‌లోకి తీసుకుంటూ ఆదేశాలు జారీ చేశారు. జేఈవోగానూ ఆయన విధులు నిర్వహిస్తారని ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇదిలావుంటే తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిన్న స్వామివారిని 73,023 మంది భక్తులు దర్శించుకోగా 26,942 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి 17 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి ఆదాయం రూ. 3.98 కోట్లు వచ్చిందన్నారు

## విద్యార్థులకు అరుదైన అవకాశం

స్పీకర్ చొరవతో అసెంబ్లీ వీక్షణం

అమరావతి,జూలై25(సూర్య వాస్తవం):
ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలు చూసే అవకాశం కల్పించారు. మొట్ట మొదటి సారిగా చదువుకునే విద్యార్థులకు ఏపీ అసెంబ్లీ సమావేశాలు చూసే అవకాశం ఆయన కల్పించారు. ప్రతిరోజు 100 మంది సభను చూసే అవకాశం ఉంది. గత మూడు రోజులుగా వివిధ కాలేజీల నుండి విద్యార్థులు అసెంబ్లీ మిగతా 2లో..

# సుప్రీం ఆదేశాలతో నీట్ తుది ఫలితాల వెల్లడి

మొదటిపేజీ తరువాయి..

చూసుకోవచ్చు. ఫిజిక్స్ విభాగంలోని అటామిక్ థియరీకి సంబంధించిన 29వ ప్రశ్నకు రెండు సమాధానాలు ఉన్నాయని, వాటిలో దేన్ని ఎంపిక చేసినా... మార్కులిచ్చారని ఆరోపిస్తూ ఓ అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. ముగ్గురు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, నివేదిక అందించాలని ఐఐటీ-దిల్లీని ఆదేశించింది. ఈ క్రమంలోనే సంబంధిత ప్రశ్నకు ఒక సమాధానమే ఉందని, రెండు లేవని... ఆప్షన్ 4 ఒక్కటే సమాధానమని నిపుణుల కమిటీ కోర్టుకు విన్నవించింది. దాంతో ఆప్షన్ 4ను ఎంచుకున్న అభ్యర్థులకే మార్కులు ఇవ్వాలంటూ ధర్మాసనం పరీక్ష నిర్వాహకులను ఆదేశించింది. ఫలితంగా మరోసారి రివైజ్డ్ ర్యాంకులను విడుదల చేయడం అనివార్యంగా మారింది. తాజాగా ఎన్‌టీఏ తుది ఫలితాలను వెల్లడించగా.. సుమారు 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులు కోల్పోయారు. దీంతో మెరిట్ లిస్ట్ మారింది. అంతేకాదు.. 720కి 720 స్కోరు సాధించిన 61 మందిలో ఈ ప్రశ్నకు మార్కులు పొందిన వారు 44 మంది ఉన్నారు. వారి స్కోరు కూడా మారడంతో టాప్ ర్యాంకర్ల జాబితా 17కు తగ్గింది.

# మహారాష్ట్రకు భారీ వర్ష హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి..

ప్రజలకు సూచించారు. గురు, శుక్రవారాల్లో ముంబై నగరంలోని శివారు ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని బృహన్ ముంబై మెట్రోపాలిటన్ కౌన్సిల్ (బిఎంసి) తెలపింది. ఇక జులై 24 ఉదయం 8 గంటల నుండి 25వ తేదీ ఉదయం 8 గంటలకు వరకు 44 మి.మీ వర్షపాతం నమోదైంది. తూర్పు శివారు ప్రాంతాల్లో 90 మి.మీ, పశ్చిమ శివారు ప్రాంతాల్లో 88 మి.మీ వర్షపాతం నమోదైందని బిఎంసి తెలిపింది. ־ూగా, పూణెలో బుధవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా ఏక్తా నగరి, విఠల్ నగర్ ప్రాంతాల్లోని ఇళ్లు, భవనాల్లోకి నీరు చేరింది. దీంతో పూణె అగ్నిమాపక సిబ్బంది పడవల సహాయంతో ఇళ్లలోని ప్రజలను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో 40 క్యూసెక్కుల నీటిని ముఠా నదిలోకి పూనె అధికార యంత్రాంగం విడుదల చేసింది. ఈరోజు ఉదయం నాలుగు గంటలకు 27203 క్యూసెక్కుల వేగంతో నీటిని విడుదల చేశారు. కుండపోత వర్షాలు కురుస్తున్న కారణంగా ఈ నది ఒడ్డున నివసించే వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పాల్ఘర్, రత్నగిరి, సింధుదుర్గ్ మీదుగా గంటకు 50 నుండి 60 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని జిల్లా సమాచార కార్యాలయం అంచనా వేసింది. అలాగే కొల్హాపూర్, పూణెలోని ఘాట్ ప్రాంతల్లోకూడా గాలులు వీచే అవకాశం ఉంది. వర్షాల కారణంగా ముంబైలోని అంధేరి సబ్‌వేపై రాకపోకలను అధికారులు మూసివేశారు. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం మొత్తానికి నీటిని సరఫరా చేసే 7 సరస్సుల్లో ఒకటైన విహార్ సరస్సు ఈరోజు తెల్లవారుజామున 3.50 గంటలకు పొంగిపొర్లింది.

# విజయతీరాలకు అడుగులు

మొదటిపేజీ తరువాయి..

గురువారం అసెంబ్లీకి సమర్పించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో దివాళా తీయించిన క్రమంలో మళ్లీ పట్టాలకు ఎక్కించేలా ప్రభుత్వం పూనుకుందని చెబుతూ ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మండలిలో మంత్రి శ్రీదర్ బాబు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఎన్నికలు ముగిసి, కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరవాత.. కేటాయింపులు ఏవీ లేకపోయిన సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆరుగ్యారెంటీల అమలు, ఇచ్చిన హామీలు పూర్తి చేయడం, అన్నిరంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా



ప్రకటిస్తూ..డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో పూర్తిస్థాయి పద్దును ప్రవేశపెట్టారు. రూ.2,91,159కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనిలో మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా చెప్పారు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.35,208.44 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లుగా పేర్కొన్నారు. ఈ ఏడాది రూ.57,112 కోట్ల అప్పులు తీసుకోవాలని ప్రతిపాదించారు. నిజాం షుగర్స్‌ను తిరిగి ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికే సింహభాగం ప్రకటించారు. రూ.72,659 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇది రైతుల తలరాతలు మార్చే చరిత్రాత్మక నిర్ణయమన్నారు. దేశ చరిత్రలో వ్యవసాయరంగానికి ఇది ఒక మైలురాయి అని తన ప్రసంగంలో పేర్కొన్నారు. రైతు భరోసా సహా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతామని, బడ్జెట్‌అంటే.. కేవలం అంకెల సమాహారం కాదు. విలువలు, ఆశల వ్యక్తీకరణ కూడా అంటూ ప్రకటించారు. జిల్లాల మధ్య ఆదాయ అంతరాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. అసమానతలు లేని సమసమాజ స్థాపన దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ ఏడాదిలోనే రైతు కూలీలకు రూ.12వేలు అందించే బృహత్తర కార్యక్రమం చేపడతాం అని అన్నారు. పీఎం ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయించాం. రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. పైసా ఖర్చు లేకుండా పంటలకు పూర్తి భద్రత కల్పిస్తాం. వరి రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించాం. ఆయిల్‌పామ్ రైతులకు అవసరమైన సాయం అందిస్తాం. 2024-25 సంవత్సరానికి రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో ఆ పంట సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 77,857 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరగ్గా.. 23,131 ఎకరాలకు అనుమతులిచ్చాం' అని భట్టి విక్రమార్క చెప్పారు.

## ఆర్థిక అవకతవకలపై నేడు శ్వేతపత్రం

మొదటిపేజీ తరువాయి..

చెందిన రూ.19,324 కోట్ల మేర బకాయిలు గుర్తించారు. ఆర్థిక శాఖ నుంచి రూ.19,549 కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో రూ.14వేల కోట్లు, మున్సిపల్ శాఖలో రూ.7,700 కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయి. ఈ వివరాలను శ్వేతపత్రం ద్వారా ప్రభుత్వం వెల్లడించనుంది. రాష్ట్రంలో అన్ని శాఖలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని చంద్రబాబు మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలు అంశాలపై ఆయన శ్వేతపత్రాలు విడుదల చేశారు. పోలవరం, అమరావతి, విద్యుత్ రంగం, ఇసుక దోపిడీ వంటి అంశాలపై శ్వేతపత్రాలను విడుదల చేసిన చంద్రబాబు వాటి వివరాలను ప్రజల ముందుంచారు. ఈ క్రమంలోనే వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై బుధవారం శ్వేతపత్రం విడుదల చేశారు. గురువారం మధ్యాహ్నం శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేసి గత ప్రభుత్వంలో భద్రతా వైఫల్యాలను ఎండగట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఆర్థిక సంక్షోభాన్ని, రాష్ట్ర వాస్తవ ఆర్థికచిత్రాన్ని ప్రజల ముందు పెట్టేందుకు సీఎం చంద్రబాబు సిద్ధమయ్యారు.

## ఎపిలో ఐదేళ్లపాటు జగన్

# అరాచకం

మొదటిపేజీ తరువాయి..

కోడెల శివప్రసాద్ , రఘురామకృష్ణంరాజు, పవన్‌కల్యాణ్,అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు తదితరులపై కేసులు పెట్టారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం న్యాయవ్యవస్థను కూడా వదల్లేదని ఆరోపించారు. 2019-24 మధ్య కాలంలో ప్రభుత్వమే హింసను ప్రేరేపించిందని అన్నారు. శాంతి భద్రతలు విఫలమయ్యారని వైసీపీ నేతలు ఢిల్లీలో నిరసన తెలుపడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలను సక్రమంగా నిర్వర్తించడంపై పూర్తి బాధ్యత తీసుకుంటుందని చంద్రబాబు ప్రకటించారు. కూటమి పాలనలో నేరాలను పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని అరికడతామని స్పష్టం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తనపై 17 కేసులు పెట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పోలీస్ వ్యవస్థను జగన్ ప్రభుత్వం పూర్తిగా విధ్వంసం చేసిందని మండిపడ్డారు. బాబ్లీ కేసు తప్ప తనపై గతంలో ఎప్పుడూ కేసులు లేవని స్పష్టం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై 7 కేసులు పెట్టారని గుర్తుచేశారు. వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని విమర్శించారు. కక్ష సాధింపు చర్యలకు గతంలో పోలీసులు ఆయుధంగా మారారని, ప్రభుత్వంతో పోలీసులు కుమ్మక్కై నిబంధనలు ఉల్లంఘించారని అన్నారు.వైసీపీ నేతలతో విభేదిస్తే పోస్టింగ్‌లు ఉండవు.. వీఆర్‌లో ఉంచేవారని తెలిపారు. ఐదేళ్లపాటు వీఆర్‌లో ఉన్న అధికారులు కూడా ఉన్నారని అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విపక్ష నేతలను అణచివేసే కుట్ర చేశారన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై 60కి పైగా కేసులు పెట్టారని, పల్లా శ్రీనివాసరావు ఇంటిని కూల్చివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. పులివెందులలో పోటీ చేసిన రవీంద్రనాథ్‌ను జైల్లో పెట్టారన్నారు. సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ.. ధూళిపాళ్ల నరేంద్రను జైలులో పెట్టారని చెప్పారు. ప్రభుత్వ అధికారులపై దాడుల నెపంతో కూన రవికుమార్‌పై కేసు పెట్టారని తెలిపారు.మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టారు. ఫర్నీచర్ దుర్వినియోగం చేశారని దివంగత నేత కోడెల శివప్రసాదరావుపై 18 కేసులు పెట్టారు. అవమాన భారంతో బతకలేక కోడెల ఆత్మహత్య చేసుకున్నారు. నాటి సీఎం జగన్ ఇంట్లో ఇప్పటికి కూడా ప్రభుత్వ ఫర్నీచర్ ఉంది. వంగలపూడి అనితపై అట్రాసిటీ కేసు పెట్టారు. అయ్యన్న పాత్రుడుపై అట్రాసిటీ, అత్యాచారయత్నం కేసు పెట్టారు. అచ్చెన్నా యుడు ఆరోగ్యం సరిగా లేకున్నా,పైల్ ఆపరేషన్ చేయించుకుని బాధపడుతున్న సంగతి తెలిసీ 600 కి.మీ. వాహనంలో తిప్పారు. రఘురామరాజును లాకప్‌లో చిత్రహింసలు పెట్టారు. రఘురామను సొంత నియోజకవర్గానికి వెళ్లకుండా చేశారు. చిత్రహింసల వీడియో చూసి నాటి సీఎం పైశాచిక ఆనందం పొందారని చంద్రబాబు ధ్వజమెత్తారు. సంబంధం లేకపోయినా పేపర్ లీక్ అయిందని పొంగూరు నారాయణపై కేసు పెట్టారు. న్యాయమూర్తుల పైనా ఫేక్ పోస్ట్‌లు పెట్టారు. టీడీపీ, జనసేన కార్యాలయాల పై దాడులు చేశారు. జై జగన్ అనలేదని తోట చంద్రయ్యను చంపారు. వైసీపీ ప్రభుత్వం అక్రమంగా జీవో1 తీసుకువచ్చింది. టీడీపీ నేతలపై 591 కేసులు పెట్టారు, 162 మందిని అరెస్ట్ చేశారు. మా



కార్యకర్తలపై1969 కేసులు పెట్టారు, 2370 మందిని అరెస్ట్ చేశారు. జనసేన నేతలు, కార్యకర్తలపై 206 కేసులు పెట్టారు. సొంత చెల్లి షర్మిలపై కూడా 2 కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతలు విఫలమయ్యా యని వైసీపీ నేతలు ఢిల్లీలో నిరసన తెలుపుతున్నారు. లా అండ్ ఆర్డర్ సక్రమంగా నిర్వర్తించడం మా బాధ్యత. తప్పుడు రాజకీయాలు చేస్తే సహించం' అని చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో 2019-24 మధ్య దయనీయంగా మారిన శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు నాయుడు గురువారం అసెంబ్లీశ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..అమరావతికి ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చినందుకు 2525మందిని అరెస్టు చేశారని తెలిపారు. న్యాయస్థనం నుంచి దేవస్థానం కార్యక్రమంలో రోడ్డుపై భోజనం చేసేలా చేశారన్నారు. అరసవెల్లి వెళుతుంటే దాడి చేసి అడ్డుకున్నారన్నారు. జగన్ మీటింగ్‌లకు వెళ్లే వారి బ్లాక్ చున్నీలను తీయించి పంపడం ఇలా... ఎన్ని అరాచకాలు చేయాలనుకున్నారో అన్ని చేశారని సీఎం విమర్శించారు. దేవాలయాలపై దాడులు చేశారని అన్నారు. అంతర్వేదిలో రథాన్ని అంటించి కథలు చెప్పారని మండిపడ్డారు. రాముడి తల తీయడం, వెండి సింహాలు దొంగిలించారన్నారు. ఎన్నికల అక్రమాలు, బోగస్ కార్డులు తయారు చేశారన్నారు. స్థానిక ఎన్నికలు అన్ని ఏకగ్రీవం చేసుకున్నారని వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ కమీషనర్ కేంద్రం నుంచి రక్షణ కోరారని సీఎం తెలిపారు. హూ కిల్డ్ బాబాయ్ మొదట హార్ట్‌ఎటాక్ అన్నారని... తరువాత లోకల్ ఎంపీ, గంగిరెడ్డి, జగన్ రోడ్డు జర్నీలో వెళ్లారని.. గ్యాంగ్ ఆర్డర్ తెచ్చారన్నారు. సునీతను కూడా నమ్మించారన్నారు. చివరకు నిందితుడు అని భావిస్తున్న ఎంపీని అరెస్టు కూడా చేయనివ్వలేదని తెలిపారు. కోడికత్తి డ్రామా,గులకరాయి డ్రామాలు ఆడారన్నారు. కల్తీ మద్యం, గంజాయి విషయంలో అప్పటి ముఖ్యమంత్రి ఒక్కరోజు అయినా సమీక్ష చేశారా అని ప్రశ్నించారు. గంజాయిని ఎట్టిపరిస్థితుల్లో నియంత్రణ చేస్తామని స్పష్టం చేశారు. అలవాటు పడ్డవారు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏజెన్సీలో వారు గంజాయి సాగు చేయ్యొద్దని అడుగుతున్నానన్నారు. నేరస్తులే ముఖ్యమంత్రి అయితే ఏం జరుగుతుందో గత అయిదేళ్లు చూశామన్నారు. చరిత్రలో ఇలాంటి నాయకుడిని ఎప్పుడైనా చూసారా? నేను నలభై అయిదు ఏళ్ళలో ఎవ్వరిని చూడలేదని అన్నారు. కేసులు ఉన్న సభ్యులు ఓసారి లేవాలని సీఎం కోరగా.. పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ సహా చాలా మంది తమ స్థానాల్లో నిలుచున్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ రాజకీయ పోరాటం చేసిన అందరిపైనా కేసులు పెట్టారన్నారు. ఎప్పటికీ బయటకు రానీయకూడదనుకున్నారని.. కానీ ప్రజలు నేరుగా అసెంబ్లీ పంపించారని చెప్పారు.రాయలసీమలో ఫ్యాక్షనిజం పోవడానికి తెదేపా హయాంలో చేపట్టిన చర్యలే కారణమని చంద్రబాబు తెలిపారు.'సీమలో ఫ్యాక్షనిజం లేకుండా చేయాలనే దృఢ సంకల్పంతో వెళ్లాం. గతంలో హైదరాబాద్‌లో మత ఘర్షణలను ఉక్కుపాదంతో అణచివేశాం. మత సామరస్యానికి విఘాతం లేకుండా చేశాం. హైదరాబాద్ అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా మారింది. నాగరిక ప్రపంచంలో వామపక్ష తీవ్రవాదం మంచిది కాదు. గ్రేహౌండ్స్, ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లు ఏర్పాటు చేశాం' అని చంద్రబాబు వివరించారు.

## శాంతిభద్రతల్లో రోల్ మోడల్‌గా ఎపి

మొదటిపేజీ తరువాయి..

సందర్భంగా ఒకరోజు శాంత భద్రతల అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. నేరాలను అరికట్టేందుకు ప్రజా చైతన్యం ఎంతో అవసరమని అన్నారు. పోలీసు వ్యవస్థను పటిష్టవంతం చేయాల్సిన అవసరముందని అన్నారు. గత వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధులు, సామాన్య ప్రజానికంపై రాజకీయ ప్రేరేపితంగా పెట్టిన కేసులను విచారించి చర్యలను తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని గౌరవించాలని అన్నారు. కూటమి సభ్యులు ఎవరూ కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని కోరారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎంతటివారిపైనా చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేయనని చంద్రబాబు వెల్లడించారు.



## విశాఖ పాలిటెక్నిక్‌లో మరుగుదొడ్ల సమస్య

మొదటిపేజీ తరువాయి..

కాలేజీ, ఎమ్మార్వో ఆఫీసు, రైతు బజార్ , ఆర్ అండ్ బీ క్వార్టర్స్‌ను తాకట్టు పెట్టేశారని విష్ణుకుమార్ రాజు తెలిపారు. విశాఖ పాలిటెక్నిక్ కాలేజ్ చాలా ప్రఖ్యాతి గాంచిన కాలేజ్ అని... ఇందులో అన్ని కోర్సులు ఉన్నాయన్నారు. 23 ఎకరాల 38 సెంట్ల విస్తీర్ణంలో కాలేజీ ఉందన్నారు. ఈ మధ్యకాలంలో పిల్లలు మంచినీళ్లు కూడా తాగకుండా కాలేజీలకు, స్కూళ్లకు వెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సరైన టాయిలెట్స్ లేకపోవడమే ప్రధాన కారణమన్నారు. కాలేజీ యాజమాన్యాలు భయపడి అసలు విషయాలను దాచేస్తున్నారని... ఉన్న వాస్తవాలు కూడా చెప్పకపోతే ప్రభుత్వం కూడా ఏమీ చేయలేదని అన్నారు. పాలిటెక్నిక్ కాలేజ్‌లో 1169 మంది అబ్బాయిలు చదుకుంటుండగా వారికి 59 టాయిలెట్స్ అవసరం ఉండగా కేవలం 14 మాత్రమే ఉన్నాయన్నారు. అలాగే 538 మంది అమ్మాయిలు చదువుకుంటున్నారని వారికి 27టాయిలెట్స్ అవసరం ఉండగా కేవలం14 టాయిలెట్స్ ఉన్నాయని తెలిపారు. కేవలం పాలిటెక్నిక్ కాలేజీలోనే కాదు... ప్రైవేటు స్కూళ్లలో కూడా ఇదే పరిస్థితి ఉందని.. దీనిపై మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించాలని విష్ణుకుమార్ రాజు కోరారు. దీనిపై మంత్రి నారా లోకేష్ సమాధానం ఇస్తూ.. విశాఖలోని పాలిటెక్నిక్ కాలేజీలో టాయిలెట్స్ సమస్య ఉందని.. త్వరలోనే ఈ సమస్య లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా వ్యవస్థలు భ్రష్టుపట్టాయని.. వాటిని క్రమంగా సెట్ చేసుకుంటూ వస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. దారి తప్పిన వాటిని సరైన దారిలో పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఒక నెలరోజులు అధికారులకు టైం ఇచ్చామని.. ఈలోగా దారితప్పిన వ్యవస్థను గాడిలో పట్టాలని చెప్పినట్లు తెలిపారు. తప్పకుండా యూనివర్సిటీల దగ్గర నుంచి కేజీల వరకు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## విద్యార్థులకు అరుదైన అవకాశం

మొదటిపేజీ తరువాయి..

సమావేశాలు వీక్షిస్తున్నారు. గురువారం నాల్గవ రోజు అసెంబ్లీ సమావేశంలో భాగంగా రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులు సుమారు 100 మంది సమావేశాలు స్వయంగా వీక్షించారు. స్వయంగా అసెంబ్లీ సమావేశాలు వీక్షించడం చాలా సంతోషంగా ఉందని విద్యార్దులు అన్నారు. టీవీలలో చూడటం తప్ప స్వయంగా వచ్చి ఈ అసెంబ్లీ సమావేశాలు వీక్షించడం చాలా సంతోషంగా ఉందని, ఈ అవకాశాన్ని కల్పించిన గౌరవ స్పీకర్ అయ్యన్న పాత్రుడుకు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. తెలుగు భాష గొప్పతనాన్ని అందరికీ తెలియజేయడంతో పాటు.. మాతృ భాష ప్రాధాన్యత తగ్గకుండా ఉండేలా అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టే సమయంలో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు పూర్తిగా తెలుగుభాషనే ఉపయోగిస్తూ కొత్త సంప్రదాయానికి నాందిపలికారు. మంగళవారం, బుధవారం సభలో ప్రవేశపెట్టిన బిల్లుల సందర్భంగా బిల్లులు ప్రతిపాదించే సమయంలోనూ, ఆమోదం పొందే సమయంలోనూ ఆయన పూర్తిగా తెలుగు భాషను ఉపయోగించారు. తాను ఈ సంప్రదాయాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తున్నానని.. సభ్యులుంతా సహకరించాలని ఆయన కోరారు.



## కొత్త టర్న్ తీసుకోబోతున్న

# జగన్ రాజకీయం

మొదటిపేజీ తరువాయి..

నడవక తప్పదు. కేంద్ర ప్రభుత్వానికి అంశాల వారీగా మద్దతిస్తామని గతంలో జగన్ ప్రకటించారు. అయితే ఇక ముందు ఎలాంటి అంశమైనా వైసీపీ తరపున ఆయన వ్యతిరేకించాల్సిందే. లేకపోతే బీజేపీతో సంబంధాలు కొనసాగుతున్నాయని ఇండి కూటమి నేతలు అనుకుంటారు. కేంద్రంలో బీజేపీపై పోరాటంలో ఇండీ కూటమికి జగన్ మద్దతు ప్రకటించకపోతే.. ఆయనకు ఇక ఏ విషయంలోనూ ఆ వైపు నుంచి సపోర్టు రాదు. ఇప్పుడు మద్దతు ప్రకటించినందుకు వారు చింతించే అవకాశం ఉంది. ఎన్డీఏ కూటమి వైపు నుంచి ఆయన ఎలాగూ సపోర్టు రాదు. కూటమిలో టీడీపీ, జనసేన ఉంటాయి. అయితే బీజేపీతో ఆయన పరోక్ష సంబంధాలను కొనసాగించవచ్చు. కానీ దాని వల్ల ఆయనకు ఎంత లాభం జరుగుతుందో అంచనా వేయడం కష్టమే. అంటే.. ఢిల్లీ ధర్నాలో తనకు సంఘీభావం తెలిపిన ఇండీ కూటమిని కాదని.. ఆయన బీజేపీకే మద్దతుగా ఉంటానని వెళ్తే.. రెంటికి చెడ్డ రేవడి అవుతారు. ఢిల్లీలో ధర్నా చేయాలని జాతీయ పార్టీల మద్దతు కోరాలని జగన్ ఎందుకు అనుకున్నారో కానీ.. ఇప్పుడు ఆయన ఇరుక్కుపోయారని వైసీపీ నేతలు భావిస్తున్నారు. ఏపీలో ఉన్నది ఎన్డీఏ ప్రభుత్వం. ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇండీ కూటమి నేతల్ని పిలిచి ధర్నా చేశారు. కాబట్టి ఆయనను బీజేపీ ఎంత మాత్రం ఇక ఆదరించదు. పైగా .. చంద్రబాబు ప్రభుత్వంపై .. జాతీయ స్థాయి నేతల్ని పిలిచి చెప్పాల్సిన అవసరం లేదు. రాష్ట్ర స్థాయిలో పోరాడవచ్చు. కానీ జగన్ ఢిల్లీ ధర్నా ఎ÷-లాన్ చేసుకున్నారు. ఇప్పుడు ఖచ్చితంగా ఆయన ఓ స్టాండ్ తీసుకోవాల్సిన సమయం వచ్చింది. ఎన్నికలు ముగిసి రెండు నెలలే కాబట్టి.. దాదాపుగా ఇంకా నాలుగున్నరేళ్లకుపైగానే ఆయన బీజేపీ కి వ్యతిరేకంగా పోరాడాల్సి ఉంంటుంది. ఇప్పుడు ఆయన వెనక్కి తగ్గలేరు.

## మదనపల్లి ఘటనతో సంబంధం లేదు

### బురదజల్లేందుకే మాపై ఆరోపణలు

### రాజంపేట ఎంపి మిథున్ రెడ్డి

న్యూఢిల్లీ,జూలై25(సూర్య వాస్తవం): తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టిస్తున్న మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం దహనం వ్యవహారంపై వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తొలిసారిగా స్పందించారు. 'మదనపల్లి ఆర్‌డీఓ ఆఫీసు ఫైళ్ల దహనంపై పసలేని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ ఘటనతో మాకు ఎలాంటి సంబంధం లేదు. మా వ్యక్తిగత ఇమేజ్ దెబ్బ తీసేందుకు కుట్ర జరుగుతోంది. మా ఆస్తుల వివరాలన్నీ ఎలక్షన్ అఫిడవిట్లలోనే ఉన్నాయి. ఈ ఘటనకు సంభందించి నిజానిజాలు ప్రభుత్వం బయటపెట్టాలి. ఈ ఘటనకు సంబంధించి అరెస్ట్ అయిన అనురాగ్ టీడీపీకి చెందిన వారే. మాపై పత్రికలు కథనాలు ప్రచురించే ముందు మా వివరణ తీసుకోవాలి. ఏకపక్షంగా కథనాలు వేయవద్దు. వివరణ అడిగితే నేను అన్ని అంశాలు చెప్తాను. ఇదిలాగే కొనసాగితే పరువు నష్టం దావా వేస్తాం' అని మిథున్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'మా ఆస్తుల వివరాలు అఫిడవిట్లలో ఉన్నాయి. చట్టబద్ధంగా ఆదాయ పన్ను కడుతూ వ్యాపారం చేస్తున్నాం. ఎవరి దగ్గర ఒక్క రూపాయి ఎలక్షన్ ఫండ్ తీసుకోలేదు . నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. రికార్డ్స్ తారుమారు చేశారని ఆరోపణలు చేస్తున్నారు. సాక్ష్యాధారాలు చూపమంటే తోక ముడిచారు. ఆరోపణలు నిరూపించకుంటే క్షమాపణ చెప్పాలి. లేదంటే , పరువు నష్టం దావా వేస్తా' అని మిథున్ రెడ్డి హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం అక్రమాలు, అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. పెద్దిరెడ్డి కుటుంబం చేతిలో మోసపోయిన బాధితులు మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయానికి క్యూ కట్టారు. వందల సంఖ్యల్లో భూ బాధితులు కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. మదనపల్లి, పుంగనూరు, తంబళ్లపల్లి, పీలేరు నాలుగు నియోజకవర్గాల నుంచి బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పెద్దిరెడ్డి కుటుంబం దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలకు భయపడి తమ బాధను ఇంతకాలం బయటకొచ్చి చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

# సంపాదకీయం

## బిజెపి కుత్సిత రాజకీయాలు !

రాజకీయాల్లో బుకాయింపులు, బెదరింపులు..ఎదురుదాడులు సర్వసాధారణమయ్యాయి. ఈ మధ్య ఇవి మరీ ఎక్కువయ్యాయి. బడ్జెట్ నిర్లక్ష్యంపై తెలంగాణ అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ సందర్భంగా అనేక విషయాలు గమనించవచ్చు. ప్రధానంగా బిజెపి ఈ విషయంలో తన దురుసుతనాన్ని ప్రదర్శించింది. అసెంబ్లీలో బిజెపి పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభలో నిర్మలా సీతారామన్‌లు చేసిన వ్యాఖ్యలు చూస్తే ఇలాంటి నేతలను ఎన్నుకున్నందుకు సిగ్గుపడాలి. బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయా లేదా అన్నది ప్రధాన అంశం. ఈ విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఖుల్లంఖుల్లాగా తేలింది.. బడ్జెట్‌లో ఎక్కడా తెలంగాణకు కేటాయింపులు జరిగిన దాఖలాలు లేవు. ఈ విషయంపై మాట్లాడుకోవడంలో తప్పు లేదు. అసెబ్లీలో చర్చించుకోవడంలోనూ తప్పులేదు. ఇది ప్రజలకు సంబంధించిన వ్యవహారం. కాంగ్రెస్, బిజెపిలకు మధ్యనో లేదా, బిఆర్ఎస్ కాంగ్రెస్‌కు మధ్య వ్యవహారమో కాదు. ఇది నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలకు సంబంధించిన వ్యవహారం. ఈ విషయంలో పార్టీల నేతలతంతా జావాబుదారీగా ఉండాల్సిందే. బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష ప్రదర్శించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ మొదటి నుంచి తెలంగాణ పట్ల కక్ష చూపిస్తున్నారని సిఎం రేవంత్ విమర్శించారు. కుర్చీని కాపాడుకునే విధంగా ఈ బడ్జెట్ ఉందని, బీహార్, ఎపిలను మాత్రమే ప్రధాని పట్టించు కున్నారని, ఇతర రాష్ట్రాలను పట్టించుకోలేదని సిఎం రేవంత్ విమర్శించారు. ఇండియా కూటమి నేతలు కూడా ఇదే విషయమై ఆందోళన చేశారు. రాష్ట్ర ఏర్పాటును అవమానించిన ప్రధాని మోడీ మొదటి నుంచి రాష్ట్రంపై కక్ష చూపిస్తున్నారని సిఎం రేవతం మండిపడడంలో తప్పులేదు. రాష్ట్ర మంత్రులతో కలిసి ఇప్పటికే 18 సార్లు కేంద్రాన్ని కలిసి విజ్ఞప్తి చేసినా, రాష్ట్రానికి న్యాయం చేయలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. 41లక్షల కోట్ల బడ్జెట్‌ను కేవలం ఎన్డీఏ మిత్ర పక్ష రాష్ట్రాలకే దోచిపెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంలో తప్పులేదు. అయితే దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చాలా అపహాస్యంగా ఉన్నాయి. ఢిల్లీకి వచ్చింది మాకోసం కాదు..కాంగ్రెస్ పెద్దలను కలవడానికే అని ఎద్దేవా చేయడం ఆయన సంకుచిత రాజకీయాలను బయటపెట్టింది. నిజానికి కేటాయింపులు జరిగాయని ఇప్పటికీ కేంద్రమంత్రి చెప్పలేక పోతున్నారు. జరిగితే ఎక్కడ ఎంతమొత్తం పెట్టారో చెప్పాలి. కానీ అలా చెప్పకుండా ఎదురుదాడికి దిగారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక కేంద్రంపై విమర్శలు చేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని నడపడంలో తమ ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బురదజల్లే డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. కేసీఆర్ ఎలాగైతే వ్యవహరించారో అదే తరహాలో రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బాటలోనే నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తుండటం తెలంగాణ ప్రజల దురదృష్టమని తనదైన రాజకీయ విశ్లేషణ ఇచ్చుకున్నారు. రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరు తెలంగాణ ప్రజలందరినీ అవమానించేలా ఉందని కూడా మండిపడ్డారు. కొత్త రేషన్ కార్డులు, కొత్త పించన్లు లేవు సరికదా పాత పింఛన్లు కూడా ఇవ్వడం లేదని ఓ నిట్టూర్పు విడిచారు. ఎన్ని హామీలిచ్చారు..? ఏం చేశారో చెప్పమంటే చేతకాదు కానీ బడ్జెట్ పేరు చెప్పి అసెంబ్లీలో తీర్మానం పెడతారా? అని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా కిషన్ రెడ్డి తన అక్కసునంతా ఇలా వెళ్లగక్కారు. అసలు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారా లేదా అన్నదానికి మాత్రం సమాధానం చెప్పలేకపోయారు. బయ్యారం ఉక్కు విషయంలో అక్కడ లభించే ఐరన్ ఓర్ నాణ్యత అంత బాగాలేదని నిపుణులు చెప్పారని మెల్లగా సెలవిచ్చారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో దేశ భవిష్యత్తుకు సంబంధించిన అనేక రకాల కార్యక్రమాలను పొందుపర్చారని అన్నారు. నిజాంగా రోగమొకటి అయితే మందు మరోటి అన్నట్లుగా కిషన్ రెడ్డి సమాధానం ఉంది. ఇలాంటి సమాధానాలతో ప్రజలను మభ్యపెట్ట లేమని కేంద్రమంత్రి గుర్తించివుంటే బాగుండేది. ఇక అసెంబ్లీలో పార్టీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అయితే తీర్మానం తప్పని, వాకౌట్ చేశారు. అసెంబ్లీలో చర్చ పెట్టి తీర్మానాలు చేయడం తప్పని అన్నారు. పార్టీ ఆదేశాలతో ఆయన కూడా నిజాలు మాట్లాడలేక పోయారు. కేటాయింపులపై నిర్మలా సీతారామన్ కూడా తన అక్కసు వెళ్లగక్కారు. బడ్టెట్‌లో అన్ని రాష్ట్రాల పేర్లు ఎలా ప్రస్తావిస్తామన్న కొత్త వాదనను ప్రకటిం చారు. బడ్జెట్ అనేది అంకెల కూర్పు లేదా కేంద్ర ప్రభుత్వ శాఖల వారీ కేటాయింపుల వ్యవహారం మాత్రమే కాదు. అది కేంద్ర ప్రభుత్వ వ్యవహారశైలికి, భవిష్యత్ దార్శనికతకు సంకేతం. ఆ రకంగా రాబోయే ఐదేళ్లు తెలంగాణ పట్ల మోదీ ప్రభుత్వ తీరు ఎలా ఉంటుందనడానికి ఈ బడ్జెట్ ద్వారా స్పష్టం అయ్యింది. బడ్జెట్ అనంతరం జరిగిన చర్చల్లో బీజేపీ నాయకుల వాదన అత్యంత పేలవంగా ఉంది. ఈ బడ్జెట్ రాష్ట్రాల వారీ కేటాయింపులు కాదు, శాఖల వారి కేటాయింపులు అని సమర్థించుకోవడం దాటవేత వ్యవహారంగా చూడాలి. తెలంగాణ గురించి అడిగితే డొంక తిరుగుడు సమాధానం చెప్పడం దారుణం కాక మరోటి కాదు.విభజన చట్టం గురించి ప్రస్తావిస్తూ ఏపీ గురించి మాట్లాడిన కేంద్ర ఆర్థికమంత్రి తెలంగాణ వెనుకబడిన ప్రాంతాల గురించి ఎందుకు మాట్లాడలేదంటే సమాధానం రాదు. బిహార్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు ఎందుకిచ్చారో..ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో దేశమంతటికి అర్థమైంది. నితీష్‌కుమార్, చంద్రబాబు నాయుడు దయాదాక్షిణ్యాల మీద మోడీ పదవి, పరువు నిలబడి ఉంది. ఆ విషయం బీజేపీ నాయకత్వానికి బాగా తెలుసు. అందుకే ఈ అదనపు వడ్డింపులు అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. బీజేపీ గత వైఖరికీ నేటి పరిస్థితికీ ఉన్న తేడాను స్పష్టం చేసింది.తనకు తిరుగులేదని చాటుకున్న మోడీ ఇప్పుడు పిల్లిలాగా అణగిమణగి ఉండాల్సిందేనన్న విషయం బడ్జెట్ నిరూపించింది. ఈ విషయంలో నిజాలు అంగీకరించకుండా బిజెపి నేతలు ఇంకెంతో కాలం ఎదురుదాడికి దిగలేరు. దిగితే ప్రజలు ఎక్కడో ఒకచోట కర్రుకాల్చి వాతపెడతారని గుర్తించాలి. నిధులు కేటాయింపు అన్నది పార్టీల వ్యవహారం కాదు. అభివృద్ధి అన్నది ప్రజలకు సంబంధించినదిగా చూడాలి.

# రాష్ట్ర ప్రయోజనాలకోసం ఉమ్మడి పోరాటం

## రాజకీయాలకు అతీతంగా కలసి నడవాల్సిందే

## తెలంగాణ అభివృద్ధి ఎజెండగా ముందుకు సాగాలి

హైదరాబాద్,జూలై25(సూర్య వాస్తవం): తెలంగాణ ప్రజా ప్రయోజనాల కోసం అంతా కలసికట్టుగా పోరాడుదా మని అసెంబ్లీలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు జ్ఞానోదయం కావాలి. తమిళనాడు లాగా ప్రయోజనాల విషయంలో కలసికట్టుగా పోరాడాలి. రాజకీయ విబేదాలను పక్కన పెట్టి పోరాడాలి. ఇప్పటికైనా తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలి. రాజకీయాల కతీతంగా, జీ హుజూర్ రాజకీయాలు పక్కన పెట్టి, రాష్ట్ర అవసరాల కోసం స్వార్థంతో పట్టుదలగా కృషి చేయాలి. అప్పుడే రాష్ట్రానికి న్యాయం జరుగుతుంది. నిధుల కేటాయింపులు జరుగుతాయి. ఈ బడ్జెట్ తెలంగాణను విస్మరించిందన్న విసయాన్ని ముందుగా అన్ని పార్టీలో రాజకీయాలకు అతీతంగా అంగీకరిం చాల్సిందే. తెలంగాణకు సంబంధించి ప్రత్యేక కేటాయింపుల విషయంలో పూర్తిగా నిరాశ కల్పించింద నడంలోసందేహం లేదు. ఏపీకి అదనంగా నిధులు ఇచ్చినందుకు అభ్యంతరం లేదు. ఎపిని ఆదుకోవాల్సిందే. అదే సందర్భంలో తెలంగాణను కూడా ఆదుకోవాల్సిందే. విలీన మండలాలపైనా ఎలాంటి ప్రతిపాదనా ప్రకటించలేదు. బడ్జెట్ సందర్భంగా ఏపీకి చెందిన కేందరమంత్రి రామ్మోహన్ నాయుడు, ఇతర ఎంపీలు వాళ్ళ రాష్ట్రానికి వచ్చిన కేటాయింపులు చంద్రబాబునాయుడు సమర్థతో తెచ్చారని చెప్పుకుంటున్నారు. తెలంగాణ ప్రజలు కూడా ఈ రాష్ట్రానికి సంబంధించి కేంద్రమంత్రులు, అధికార పార్టీ ఎంపీలు మాట్లాడాలని కోరుకోగలగాలి. మేమంతా సమర్థంగా సమిష్టిగా పోరాడి నిధులు తెచ్చుకోగలిగామని చెప్పుకోవాలి. బండి సంజయ్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. కేటాయింపుల్లో అన్యాయం గురించి ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ తరహాలో బిజెపి కూడా తమ విధానం ప్రకటించాలి. తెలంగాణ వారిగా మనమంతా ప్రశ్నించాల్సిందే. పెదవి విప్పక పోతే నష్టం జరుగుతూనే ఉంటుంది. రాష్ట్ర ప్రయోజనాలను, ప్రత్యేకించి రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినందున హామీలపై పోరాడాల్సిందే. కేంద్రమంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉండి కూడా, ఈసారి తెలంగాణ నుంచి బీజేపీకి ఎన్నడూ లేనంత ఆదరణ




దొరికినా కూడా కేంద్రమంత్రులు, ఎంపిలు మాట్లాడకపోవడం తెలంగాణ ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. ఎనిమిదిమంది ఎంపీలను గెలిపించిన ప్రజలు గర్వపడేలా ఎంపీలు ప్రత్యేకంగా తమ రాష్ట్రానికి ఏమైనా సాధించారో చెప్పడలగాలి. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన పన్నుల్లో వాటా రావడం వేరు. కేంద్ర ప్రాయోజిత పథకాలు ఎవరున్నా లేకున్నా వస్తాయి. కానీ కేటాయింపుల్లో మాత్రం పోరాడాల్సిందే. కేంద్ర వ్యవహారశైలి, తెలంగాణ పట్ల వారి వైఖరి ఈ ఒక్క బడ్జెట్‌తో స్పష్టం అయ్యింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో సఖ్యత నెరపలేదని అంటున్న వారు.. ఇప్పుడు రేవంత్ రెడ్డి సఖ్యతగా ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో కిషన్ రెడ్డి లాంటి వారు చెప్పాలి. సిఎం, మంత్రులు కలసికట్టుగా పలువరు వినతిపత్రాలు సమర్పించినా లాభం లేకుండా పోయింది.
అందుకే ఇప్పుడు కేంద్రంపై పోరాటంలో రాజకీయాలు అతీతంగా కలిసి రావాలని సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు సరైనదిగానే భావించాలి. రేవంత్‌రెడ్డి ఇప్పుడు దక్షిణాది ప్రస్తావన తెచ్చి, మిగతా రాష్ట్రాలకు జరుగుతున్న విసయాన్ని దేశం దృష్టికి తెచ్చారు. ఇవన్నీ ఇలావుంటే ఘనంగా చెప్పుకుంటున్న బడ్జెట్ ద్వారా ద్రవ్యోల్బణం గురించి చర్చించలేదు. వికసిత భారత్‌లో ప్రతిరోజూ ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించే ప్రయత్నాలపై మాట్లాడలేదు. మొత్తంగా రాష్ట్ర ప్రయోజాల విషయంలో అంతా ఒక్కటే అన్న నినాదం రావాలి. కాలసి పోరాడాలి. అప్పుడే మన ప్రయోజనాలు నెరవేరుతాయి.

# యువతకు కాగడా అందించే తరుణం

## అధ్యక్ష బరినుంచి తప్పుకోవడంపై బైడెన్ వివరణ

## దేశం కోసమే తన నిర్ణయమని వివరణ

వాషింగ్టన్,జూలై25(సూర్య వాస్తవం): అమెరికా అధ్యక్ష ఎన్నికలు–2024 రేసు నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించిన అనంతరం ప్రెసిడెంట్ జో బిడెన్



తొలిసారి బుధవారం స్పందించారు. అమెరికా మార్గదర్శకత్వాన్ని యువతరానికి అందిస్తున్నానంటూ ఆయన వ్యాఖ్యానించారు. యువ గళాలకు కాగడాను అందించాల్సిన తరుణం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఈ మేరకు అమెరికన్లను ఉద్దేశించి 'ఓవల్ ఆఫీస్' నుంచి ఆయన చారిత్రాత్మకమైన ప్రసంగం చేశారు. డెమొక్రాటిక్ పార్టీని, దేశాన్ని ఏకం చేసేందుకే తాను 2024 ఎన్నికల నుంచి వైదొలగుతున్నట్టు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్యం సంరక్షణ అన్నింటి కంటే ముఖ్యమైనదని, నవతరానికి కాగడాను అందించడమే ఉత్తమ మార్గం అని తాను నిర్ణయించుకున్నానని, అమెరికాను ఐక్యం చేయడానికి అదే ఉత్తమ మార్గమని ఆయన అన్నారు. కష్టపడే సామర్థ్యం ఉన్న వైస్ ప్రెసిడెంట్ కమలా హారీస్ డెమొక్రాటిక్ పార్టీ ప్రెసిడెన్షియల్ నామినీగా ఎంపికయ్యారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. డొనాల్డ్ ట్రంప్‌తో పోల్ డిబేట్‌లో జో బైడెన్ వెనుకబడడం, ఆ తర్వాత ట్రంప్‌పై హత్యాయత్నం నేపథ్యంలో ఎన్నికల రేసు నుంచి తప్పుకో వాలంటూ డెమొక్రాటిక్ శ్రేణులు బైడెన్‌పై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చాయి. దాదాపు రెండు వారాల తర్వాత ఆయన రేసు నుంచి వైదొలిగారు. దీంతో భారతీయ మూలాలు ఉన్న కమలా హ్యారీస్ రేసులోకి వచ్చిన విషయం తెలిసిందే. అమెరికా రాజకీయాల్లో ప్రతీకారాలకు ముగింపు పలకాలని, దేశం కంటే ఏ నియంతృత్వం, నిరంకుశం ఎక్కువ కాదు అంటూ బైడెన్ పవర్ ఫుల్ ప్రసంగం ఇచ్చారు. యువ గళాలకు, సరికొత్త నేతలకు సమయం సమయం ఆసన్నమైందని, ఆ సమయం ఇదేనని అన్నారు. కాగా జీవితంలో అత్యంత కీలక ప్రసంగం చేస్తున్న సమయంలో ఆయన కుటుంబ సభ్యులు ఓవల్ కార్యాలయంలో ఆయన ముందు కూర్చొని విన్నారు.
ఆయనకు సపోర్టుగా అక్కడే ఉన్నారు. భార్య జిల్ బైడెన్, కూతురు యాష్లే, కొడుకు హంటర్ ఉన్నారు. ప్రసంగం ముగిసిన తర్వాత ఆయన వద్దకు వెళ్లి ఆప్యాయంగా చేతులు పట్టుకున్నారు. బిడెన్ మనవరాళ్లు కూడా ఓవల్ ఆఫీస్‌కు వచ్చారు. అధ్యక్షుడు జో బైడెన్ ప్రసంగంపై రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష నామినీ డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. వండి వార్చిన జో బిడెన్ ఓవల్ ఆఫీస్ ప్రసంగం అర్థమైంది. చాలా చెడ్డగా ఉందని ట్రంప్ అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. కాగా అధ్యక్ష ఎన్నికలకు ఫిట్ కాని వ్యక్తి అధ్యక్షుడిగా మాత్రం ఎలా కొనసాగుతారని, వైగొలగాలంటూ రిపబ్లికన్ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అధ్యక్షుడిగా పనిచేయడానికి ఆయన తగినవాడు కాదని అంటున్నారు. విమర్శలకు జో బైడెన్ సమాధానం ఇచ్చారు. తాను కుంటివాడిని కాదని, పదవిలో ఉన్నంత కాలం ఆర్థిక వ్యవస్థ, కీలకమైన విదేశాంగ విధాన సమస్యలపై పని చేస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. రాబోయే ఆరు నెలల్లో తాను అధ్యక్షుడిగా పని చేయడంపై దృష్టి పెడతానని చెప్పారు.కాగా బిడెన్ లేకుండానే అమెరికా ఎన్నికల ప్రచారం జరుగుతోంది. డెమొక్రాటిక్ పార్టీ నామినీగా కమలా హ్యారీస్‌కు పార్టీ ప్రతినిధుల మద్దతు లభిస్తుండడంతో ఆమె ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

# వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

## జిల్లాల్లో మలేరియా,డెంగ్యూల ప్రభావం

## అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ హెచ్చరిక

కాకినాడ,జూలై25(సూర్య వాస్తవం): యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబందిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, భౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది.
మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు



అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాటులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

# బడ్జెట్ కేటాయింపులతో ఎపికి ఊపిరి

## బడ్జెట్‌పై చర్చలో ఎంపి సిఎం రమేశ్



న్యూఢిల్లీ,జూలై25(సూర్య వాస్తవం): ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులతో కేంద్రం ఆక్సిజన్ అందించిందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన లోక్‌సభలో మాట్లాడారు. గతంలో ఏ ఎప్పుడూ జరగని విధంగా... ఏపీకి న్యాయం జరిగిందన్నారు. ఒక్కసారి జగన్‌కు అవకాశం ఇస్తే.. రాష్ట్రం మొత్తాన్ని దోచేశాడని, ల్యాండ్, శాండ్‌మైనింగ్, భూములు, లిక్కర్ ఇలా అన్నింట్లో దోపిడీ జరిగిందని చెప్పారు. 'ప్రస్తుతం రాష్ట్రం పరిస్థితి ఎలా ఉందో అర్థం కావట్లేదు. ఒక ఆర్థిక ఉగ్రవాది సీఎం అయితే రాష్ట్రం ఏ విధంగా నష్టపోతుందో కళ్లారా చూశాం. ఇందుకు సహకరించిన అధికారులపై కేంద్రం చర్యలు తీసుకోవాలి. మరే రాష్ట్రంలోనూ ఈ విధంగా జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇప్పుడు ముఖ్యమంత్రి విడుదల చేస్తోన్న శ్వేతపత్రాల్లో పేర్కొన్న అంశాలపై దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలి. రాష్ట్రంలో దోచేసిన ప్రజల సొమ్మును తిరిగి రాష్ట్రాభివృద్ధికి ఖర్చు చేయాలి. ప్రధాని స్వయంగా శంఖుస్థాపన చేసి రాజధానిగా అమరావతి అని చెప్పారు. కేవలం.. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు పేరు వస్తుందనే ఉద్దేశంతో అక్కడ రాజధానిని నాశనం చేశారు.
దేశంలో, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా దాదాపు 33వేల ఎకరాలు ల్యాండ్ పూలింగ్ జరిగింది. భూములు ఇచ్చిన రైతులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారు. ఈ ఐదేళ్లలో జగన్ చేసిన దోపిడీకి అమరావతి రైతులు, ప్రజలు గుణపాఠం చెబుతూ తీర్పు ఇచ్చారు. 93శాతం స్ట్రైక్‌రేట్‌తో దేశంలో ఎప్పుడు, ఎక్కడా ఇవ్వని విధంగా తీర్పు ఇచ్చి జగన్‌ను ఇంటికి పంపారు' అని సీఎం రమేశ్ విమర్శించారు.

# ప్రశ్న వేసి మొహం చాటేసిన వైకాపా ఎమ్మెల్యే

**మొగుణ్ణి కొట్టి మొగసాలకు ఎక్కిన జగన్**

**రాష్ట్రంలో శాంతిభద్రతలపై జగన్ దొంగ ఏడ్పులు**

**అసెంబ్లీలో హోంమంత్రి వంగలపూడి అనిత**

అమరావతి,జూలై25(సూర్య వాస్తవం): మొగుణ్ణి కొట్టి మొగసాలకు ఎక్కిన సామెత తరహాలో..గత ఐదేళ్లపాటు అరాచక పాలన సాగించిన మాజీ సిఎం ఢిల్లీలో ధర్నా చేయడం దారుణంగా ఉందని హోంమంత్రి వంగల పూడి అనిత అన్నారు. ఎన్నో అరాచకాలు చేసిన జగన్ ఎన్‌డిఏ పాలనలో అక్రమాలు జరిగాయంటూ గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు నాల్గవ రోజు గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయంలో హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. వైసీపీ సానుభూతి పరులపై దాడులు జరుగుతున్న విషయం వాస్తవమేనా అని వైసీపీ వాళ్లు ప్రశ్నవేసి సభకు రాలేదని ఎద్దేవా చేశారు. టీడీపీ కార్యకర్తలను చంపి ఢిల్లీ వెళ్లి అక్కడ దీక్షచేయడం ఏంటని హోంమంత్రి అనిత ప్రశ్నించారు. నిజానికి టీడీపీ వాళ్లను చంపి అదేదో తాము చేసినట్టు ఆరోపిస్తున్నారని, అధికారం కోల్పోయి..11 సీట్లు సాధించాక టీడీపీ కార్యకర్తలను చంపి ఢిల్లీ వెళ్లి అక్కడ దీక్షచేయడం ఏంటని ప్రశ్నించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నలుగురు చనిపోతే ముగ్గురు టీడీపీకి చెందిన వారు ఉన్నారని, దానికి సంభందించి కేసు నెంబర్లతో సహ వెల్లడించామని హోంమంత్రి తెలిపారు.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 36 రాజకీయ హత్యలు జరిగాయని వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారని, వారి పేర్లు చెప్పమంటే మాట్లాడలేదని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. 36 మంది వివరాలు అసెంబ్లీకి వచ్చి ఇవ్వవచ్చుకదా.. అలా చేయకుండా ఢిల్లీ ఎందుకు వెళ్ళారని ఆమె ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఆత్మకూరుకు ప్రతిపక్షనేత చంద్రబాబు వెళ్ళాలనుకుంటే ఆయన ఇంటి గేటుకు తాళ్లు కట్టారని, పవన్ కళ్యాణ్ అమరావతి రైతుల వద్దకు వెళితే ముళ్లకంపలు వేశారని, యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌కు స్టూల్ ఎక్కి నిల్చోవడానికి కూడా అనుమతి ఇవ్వలేదని హోంమంత్రి మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం మీడియాతో పాటు ఎవ్వరినీ వదలలేదు అనే విషయం మర్చిపోకూడదని.. ఇలాంటి భయానక వాతావరణంను గత అయిదు సంవత్సరాలు రాష్ట్రంలో సృష్టించారని అన్నారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌ను అడుగుతున్న.. 36 మంది చనిపోయారు అని అంటున్నారు. దానికి ఆయన సభకు వచ్చి ఆ వివరాలు ఇవ్వాలని హోంమంత్రి వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. తాము చర్యలు తీసుకుంటామని.. అయితే జగన్ ఇచ్చిన వివరాలు తప్పు అని తేలితే ప్రభుత్వం తీసుకునే చర్యలకు భాద్యులవుతారని ఆమె హెచ్చరించారు. లోకేష్ రెడ్ బుక్ గురించి వైసీపీ కార్యకర్తలే పట్టించుకోవడం లేదని.. మరి జగన్‌కు ఎందుకు నిద్దర పట్టడం లేదో చెప్పాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.



## సుప్రభాతంను కించపరిచిన కదిరే కృష్ణను వెంటనే అరెస్టు చేయాలి

–విశ్వహిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీల డిమాండ్..

పత్తికొండ టౌన్ (సూర్య వాస్తవం): ప్రపంచంలోనే అతి పవిత్రమైన పుణ్యక్షేత్రం విశ్వ వ్యాప్తంగా నిరంతరం గోవిందా గోవిందా అంటూ కొలిచి తలిచే ఆ దేవ దేవుడైన శ్రీ వేంకటేశ్వరస్వామి స్వామి వారి సుప్రభాతాన్ని కదిరే కృష్ణ అనే వ్యక్తి అవహేళన చేస్తూ మిడి మిడి జ్ఞానంతో నోటి కొచ్చినట్లు దురుసుగా వ్యాఖ్యలు చేసి సమాజంలో అత్యధిక జనాభా కలిగిన హిందువుల మనోభావాలను తీవ్రంగా కించి పరిచేలా మాట్లాడాడని అతడిని వెంటనే అరెస్టు చేసి, కేసు నమోదు చేసి శిక్షించాలని విశ్వహిందూ పరిషత్



అధ్యక్షులు వీరరాజులు, బిజెపి అసెంబ్లీ కో కన్వీనర్ గోవర్ధన్ నాయుడులు డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు నిరసనగా కర్నూలు జిల్లా పత్తికొండలో గురువారం విశ్వ హిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీలు ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తూ కదిరి కృష్ణను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండే విధంగా న్యాయం చేయాలని స్థానిక పత్తికొండ పోలీస్ స్టేషన్ లో సిఐ మురళీమోహన్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన అనంతరం,%=ఋా,వీ=ా% ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ ఈరమ్మకు,%ూా% అధికారి వీరేష్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో %=ూా% జిల్లా సహ వ్యవస్థ ప్రముఖ్ రామలింగయ్య, మన్ కీ బాత్ కో కన్వీనర్ కరణం నరేష్,బిజెపి నాయకులు పూనా మల్లికార్జున, శంకరయ్య,హిందూ ధార్మిక సంస్థ నాయకులు సోమన్న, ఉపేంద్ర, నాయుడు, బోయ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## భిన్నత్వంలో ఏకత్వం మన భారతీయ నేపథ్యం.

–ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ.

పత్తికొండ టౌన్ ( సూర్య వాస్తవం): "శిక్షా సప్తాహ్ (విద్యా వారం) "కార్యక్రమము లో భాగంగా పత్తికొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నాడు స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె



మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం మన చారిత్రక నేపథ్యం అని ఆమె తెలిపారు. మన దేశంలో వివిధ రకాల మతాలు,భాషలు,సంస్కృతులు, ఆచారాలు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ మనమంతా ఒకే పూల మాలలో ఇమిడిపోయిన వివిధరకాల పూల వలె కలిసి పోవాలని అన్నారు. ఇలాంటి మన గొప్ప సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా ఒకే స్కూల్లో చదువుకుంటూ, సమదు స్తులు ధరిస్తూ , మధ్యాహ్న భోజన మును ధనిక ,పేద బేధం లేకుండా అందరూ సమానంగా ఒకేచోట కూర్చొని పాఠశాల లో భు జించడం భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనం అని ఆమె తెలియ చేసారు. బాల్య దశలోనే పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు భిన్నత్వంలో ఏకత్వం మార్గంలో నడిచే విధంగా టీచర్లు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ఈసందర్భగా పిల్లలు అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయిని ,ఉపాధ్యాయులు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## గుత్తి మండలాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తాం

–గుమ్మనూరు నారాయణ

–గుత్తిలో పలు కాలనీలను పర్యటన..

గుత్తి, సూర్య వాస్తవం: గుత్తి లో మున్సిపాలిటీ పరిధిలోనీ పలు కాలనీలలో గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం సోదరుడు గుత్తి మండల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ



గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తి మండలాన్ని అన్నివిధాల అభివృద్ధి బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా స్థానిక సమస్యల వివరాలను అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, బిజెపి, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

హిందూపురం టౌన్ (సూర్య వాస్తవం) హిందూపురం పట్టణంలో పాండురంగ నగర్ సమీపంలో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యం అయింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పాండురంగ నగర్ సమీపంలో చెట్లలో ఓ యువకుని మృతదేహం ఉన్నట్లు కనుగొని పోలీసులకు సమాచారం అందించగా పోలీసు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు.



## సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు కోసం రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలి

– సాధారణ బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి

– రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కోరిన రాష్ట్ర ఆర్థిక , ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్..

అనంతపురం (సూర్య వాస్తవం): గుత్తి మండలం సేవాఘడ్ లో వెలసిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల రూ.50 లక్షలు మంజూరు చేయాలని, ఈ మేరకు సాధారణ బడ్జెట్‌లో నిధులను కేటాయింపులు చేయాలని గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని రాష్ట్ర ఆర్థిక %ఒ% ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ గారు కోరారు.శ్రీ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అనంతపురం జిల్లాలోని గుత్తి మండలం సేవాఘడ్ లో జన్మించారని, ప్రతి ఏడాది ఫిబ్రవరి 13 నుండి 15 వరకు దేశవ్యాప్తంగా ఆయన జయంతిని జరుపుకుంటున్నారన్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మరియు లక్షలాది మంది భక్తులు ఆయన జన్మదిన వేడుకలకు హాజరై సేవాగడ్ లో మాతా జగదాంబ మరియు సేవాలాల్ మహారాజ్ కి ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేస్తారన్నారు. 2019 – 2024 మధ్యకాలంలో రాష్ట్రంలో ఇంతకుముందు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎటువంటి నిధులను



మంజూరు చేయలేదన్నారు. ఉత్సవాల సమయంలో రవాణా, ఆహారం, వసతి మరియు ఇతర సౌకర్యాల కోసం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఛారిటబుల్ ట్రస్ట్ వివిధ రుణాలు తీసుకున్నారన్నారు. 2014 – 2019 మధ్యలో తమ ప్రభుత్వం వేడుకలు నిర్వహించడానికి ప్రతి సంవత్సరం 25 లక్షల రూపాయలను మంజూరు చేసిందని పేర్కొన్నారు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 ఫిబ్రవరి 13 నుండి 15 వరకు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను నిర్వహించడం కోసం 50 లక్షల రూపాయలను మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆర్థిక మంత్రి కోరారు. ఇందుకు సంబంధించి సాధారణ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేయాలని గౌరవ ముఖ్యమంత్రిని మంత్రి అభ్యర్థించారు. వచ్చే ఫిబ్రవరి 2025లో జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల కోసం నిధుల మంజూరు మరియు తర్వాత ఇక్కడ బడ్జెట్ అంచనాలలో కేటాయింపులు చేయడం కోసం సంబంధిత అధికారులు పరిశీలించి, ఆదేశించవలసిందిగా ముఖ్యమంత్రిని ఆర్థిక మంత్రి కోరడం జరిగింది.

## సర్వేనెంబర్ 143 లోని భూమిని పరిశీలించిన ఆర్డీఓ

సిద్దవటం సూర్యవాస్తవం



మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేట లోని సర్వేనెంబర్ 143లోని 2.85 ఎకరాల భూమిని గురువారం పరిశీలించామని కడప ఆర్డీఓ వెంకటపతి తెలిపారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు సదరు భూమిని గత కొన్నేళ్లుగా ప్లేగ్రౌండ్ గా ఉపయోగించు కుటున్నారని, ఒక పట్టాదారు, కొనుగోలు దారుడు విద్యార్థులను ఇక్కడ మీరు ఆడుకోవద్దు అని కంచె వేస్తున్నారని, చెప్పడంతో విద్యార్థులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు గ్రౌండ్ ను పరిశీలించామన్నారు. విద్యార్థులకు తమకు ప్లే గ్రౌండ్ కావాలని ఆర్డీఓను కోరారు. దీంతో ఆయన గ్రౌండ్ భూమి రికార్డులో ఎలా ఉంది. ఫీల్డ్ లో ఎలా ఉందని వాటిని పరిశీలించారు. ఈమేరకు నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పిస్తామని ఆయన చెప్పారు. అంతకు ముందు ఆర్డీఓ వెంకటపతి సిద్దవటం లోని తహసీల్దారు కార్యాలయంలో రికార్డు రూమ్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మురషావలి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అనురాధ, విఆర్వో కేశవులు, సచివాలయ సర్వేయర్ పురుషోత్తంరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కనికరం లేని లేడీ డాక్టర్లు...

కర్నూలు సర్వజన ఆస్పత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యం

– నిండు గర్భిణి అని చూడకుండా ఓపి చీటీ చించిన వైనం

– కొడుకు పుడితే ఒక రేటు...... కూతురు పుడితే ఒక రేటు

– పట్టించుకోని సూపరిండెంట్

కర్నూలు ( సూర్య వాస్తవం) ఇటీవల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రిల్లోని దారుణ ఘటనలు రోజు రోజుకి ఎక్కువైపోతున్నాయి. మెరుగైన వైద్య సదుపాయాల కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులకు, ముఖ్యంగా గర్భిణీలకు సకాలంలో వైద్యం అందించడంలో వైద్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతోపాటు వారికి కనీస మౌలిక



సదుపాయాలను అందించకపోగా.. సరైన సమయానికి ప్రసవం చేసేందుకు కూడా ముందుకు రావడం లేదు. ఈ క్రమంలోనే నగరంలో ఇప్పటికే చాలమంది గర్భిణీలు ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మరణించిన ఘటనలు చాలా జరిగాయి. అయితే తాజాగా మరో గర్భిణీ మహిళ ప్రసవం కోసం కర్నూలు లోని ఆసుపత్రికి వెళ్లడంతో అక్కడ డాక్టర్ చేసిన పనికి జరగరాని ఘోరమే జరిగిపోయింది. అసలు వివరాల్లోకి వెళితే......

కర్నూలు సర్వజన వైద్యశాల కాన్పుల వార్డులో డాక్టర్ల నిర్లక్ష్యం తో నిండు గర్భిణీ ఓపి చీటీ చింపి బయటకు పంపించారు లేడీ డాక్టర్లు. నెలలు నిండిన నిండు గర్భిణీ ఉదయం 11 గంటలకు ఎమ్మిగనూరు నుండి అంబులెన్సు లో కర్నూలు పెద్దసుపత్రి కి వస్తే కనీసం వైద్యం కూడా చేయని కాన్పుల వార్డు లోని లేడి డాక్టర్లు. చివరకు తనకు తెలిసిన వారితో కలెక్టర్ ఆఫీస్ కు వెళ్లి రెకమండేషన్ ద్వారా సాయంత్రం 5:30 గైనిక్ వార్డు (కాన్పుల వార్డు ) లో అడ్మిట్ అయినా పట్టించుకున్న పాపాన పోలేదనీ బాధితులు వాపోతున్నారు.



ఈ విషయంపై అధికారికి ఫిర్యాదు చేసిన ఫలితం లేదన్నారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల నిండు గర్భిణికి , పిండాన్ని ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారనీ వారు ప్రశ్నించారు. ఇదిలా ఉంటే సర్వజన ఆస్పత్రిలో ఆడ శిశువుకు ఒక రేటు మగ శిశువుకు ఒక రేటు. కొడుకు పుడితే రెండు వేల రూపాయలు, కూతురు పుడితే 1000 రూపాయలు అనధికారికంగా వసూలు చేస్తున్న లేబర్ రూమ్ సిబ్బందనీ బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు

## జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద

42 గేట్లు ఎత్తి నీటి విడుదల ములుగు జిల్లాలో భారీ వర్షాలు

మహబూబ్‌నగర్,జూలై25 : గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తింది. దీంతో అధికారులు ప్రాజెక్టు 42 గేట్లు ఎత్తివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2.06 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. జలాశయం నుంచి 1.97 లక్షల క్యూక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో స్పిల్‌వే ద్వారా 1.69 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 24,201 క్యూసెక్కులు, నెట్టెంపాడు లిఫ్ట్‌కు 1500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్‌కు 1300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిట్టం 318.51 మీటర్లు కాగా ఇప్పుడు 316.71 మీటర్ల వద్ద నీరు ఉన్నది. అదేవిధంగా ప్రాజెక్టులో 9.65 టీఎంసీల నీటి నిల్వకుగాను ప్రస్తుతం 6.23 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఇక ఎగువన మహారాష్ట్రలో ఉన్న ఆల్మట్టి నుంచి 2.25 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తున్నది. ఉదయం 10.30 గంటల వరకు అది 2.50 లక్షలకు చేరవచ్చని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా కర్ణాటకలోని నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 2.24 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తున్నది. ప్రస్తుతం ప్రాజెక్టులో 26.623 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థం 33.313 టీఎంసీలు. ములుగు జిల్లాలో వానలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు చెరువులు, కుంటలు మత్తడి దుంకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలుచోట్ల చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాజాగా జిల్లాలోని ఏటూరు నాగారం మండలం చిన్నబోయినపల్లి వద్ద గల 163వ జాతీయ రహదారిపై భారీ వృక్షంకూలింది. ఈ ప్రమాదంలో చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన జహంగీర్ అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జహంగీర్ తన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా బోయిన పల్లి వద్దకు రాగానే ఒక్కసారిగా భారీ వృక్షం కూలి తన మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమా చారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



## భువనేశ్వరిని కలిసిన కుప్పం న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

కుప్పం సూర్యవాస్తవం కుప్పం పీఈఎస్ గెస్ట్ హౌస్ వద్ద నారా భువనేశ్వరిని కుప్పం న్యాయవాదుల సంఘం ప్రతినిధులు గురువారం ఉదయం కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెతో మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించినందుకు వారు తమ సంతోషం వ్యక్తం చేశారు. వైసీపీ



తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని నారా భువనేశ్వర్ కి న్యాయవాదులు తెలిపారు. సామాన్యుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న చొరవను వారు కొనియాడారు. అనంతరం నారా భువనేశ్వరి తో న్యాయవాదులు మాట్లాడుతూనిజం గెలవాలి పర్యటనలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పై ఇచ్చిన వినతికి, నేడు అసెంబ్లీలో ఫలితం కనిపించిందని తెలిపారు. దీంతో ఆమె న్యాయవాదులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం, చంద్రబాబు ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. సామాన్యులకు న్యాయవాదులు న్యాయపరమైన సేవలు అందించి సమాజానికి తోడ్పడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కుప్పం న్యాయవాదుల సంఘం నేతలు పాల్గొన్నారు

## ఇచ్చిన మాట మరువను... త్వరలోనే అన్న మాట నిలబెట్టు కుంటా పాత్రికేయులకు వాగ్దానం

**మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రవాణా యువజన మరియు క్రీడా శాఖ మాత్యులు**

**పాత్రికేయుల సంక్షేమం, అభ్యున్నతి, హక్కులకై మరో అడుగు ముందుకు**

**రాష్ట్ర రాజధాని అమరావతిలో మంత్రి మండిపల్లి ని కలసిన రాయచోటి నియోజకవర్గం లోని పలువురు పాత్రికేయులు.**

**గత కొన్ని సంవత్సరాలుగా విలేకరులు ఎదురుకుంటున్న ప్రధాన సమస్యలపై కొనసాగిన చర్చ.**

**సమస్యలు విని సానుకూలంగా స్పందించి సకాలంలో మీ సమస్యలు పరిష్కారిస్తాం అంటూ హామీ ఇచ్చిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి**

రాయచోటి సూర్య వాస్తవం ఇచ్చిన మాటకు కట్టుబడిఉన్న త్వరలోనే పాత్రికేయ సోదరులకు ఇంటి స్థలాలను కేటాయించడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మీడియా మిత్రులకు వాగ్దానం చేశారు. పాత్రికేయుల సోదరుల సమస్యల పరిష్కారం



కోరుతూ రాయచోటి చెందిన పలువురు విలేకరులు బుధవారం రాత్రి రాష్ట్ర రాజధాని అమరావతి లోని వారి విడిది గృహంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసారు. జర్నలిస్టులు సంక్షేమంతో పాటు దశాబ్ద కాలంగా వారుఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి మండిపల్లి కి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజాస్వామ్యంలో మూఖ్యమైన నాలుగవ స్తంభంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిదిగా ఉన్నటువంటి జర్నలిస్టు సోదరుల హక్కులకు ఎటువంటి భంగం వాటిల్లకుండా వారికి ఎటువంటి సమస్య వచ్చినా ఆ సమస్యల పరిష్కారానిపై కృషి చేస్తానని పాత్రికేయ మిత్రులకు మంత్రి వాగ్దానం చేశారు.

## కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

విజయనగరంలో సిపిఎం రాస్తారోకో

విజయనగరం,జూలై25 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎటువంటి కేటాయింపులు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందని రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు డిమాండ్



చేశారు. గురువారం స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద బ్జడెట్ కేటాయింపులను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, తెలుగు ఆడపడుచు అయిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతారామన్ రాష్ట్రానికి కేటాయింపులు చేయకుండా అన్యాయం చేశారన్నారు. విభజన చట్టంలోని అంశాలను నెరవేరుస్తామని చెప్పడం తప్ప ఎటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. పోలవరానికి నిధులు లేవు, ఉత్తరాంధ్ర సుజలస్రవంతికి నిధులు కేటాయింపు లేదు, రైల్వే జోన్ ప్రస్తావన లేదు, జిల్లాలో గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయింపు లేదు, అమరావతి నిర్మాణానికి ప్రకటించిన 15 వెల కోట్లు ప్రపంచ బ్యాంక్ అప్పుకింద చెప్పడం దుర్మార్గమన్నారు. ఎటువంటి నిధులు కేటాయించకుండా కేంద్రం బ్జడెట్ పెడితే రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయింపులు చేయకుండా కేటాయిస్తామని చెప్పి రాష్ట్ర ప్రజలను మరోసారి బిజెపి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వం విధానాన్ని రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తగిన నిధులు కేటాయింపులు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో సిపిఎం నాయకులు ఏ.జగన్మోహన్, పి.రమణమ్మ, బి.రమణ, యు ఎస్ రవికుమార్, సి హెచ్ వెంకటేష్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం నిర్మాణంకు రూ.1లక్ష విరాళం

### -దాతృత్వం చాటుకున్న తీగల నారాయణరెడ్డి

నార్పల సూర్య వాస్తవం: మండల కేంద్రమైన నార్పలలోని స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి నార్పల మేజరు గ్రామ పంచాయితీలోని మజరా గ్రామమైన సుల్తాన్‌పేట వాసి తీగల నారాయణరెడ్డి భార్య అన్నపూర్ణమ్మ ఆలయ నిర్మాణం కొరకు రూ.1,00,000 రూపాయలు విరాళం ఆలయ ప్రధాన అర్చకులు



బ్రహ్మేంద్రస్వామికి అందజేసి దాతృత్వం చాటుకున్నారు. భాగవత సప్తహ సంఘం అధ్యక్షులు, ఆధ్యాత్మిక కార్యక్రమ నిర్వాహకులు తీగల నారాయణ రెడ్డి మాట్లాడుతూ సొంత గ్రామంలో లక్ష్మి నరసింహ దేవాలయం నిర్మించడం కోసం తనకు తోచిన సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు.నార్పల గ్రామం కూతలేరు నది ప్రక్కన ఉన్న అయ్యప్ప స్వామి కోవెల ప్రాంగణంలో అయ్యప్ప మూల విరాట్ తోపాటు, షిరిడీ సాయిబాబా, పార్వతి, పరమేశ్వరులు, వినాయకుని విగ్రహాలతో పాటు నవగ్రహాలు, నాగుల కట్ట నిర్మాణంతో ఆధ్యాత్మిక శోబా వర్ధిల్లు తున్నదన్నరు. లక్ష్మీనరసింహ దేవాలయం నిర్మాణం పూర్తి అయితే భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు.

## అంటు వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

రైల్వే కోడూరు సూర్య వాస్తవం: రానున్న వర్షాకాల పరిస్థితుల్లో అంటూ రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ఈఓపి ఆర్‌డి, సిహెచ్ నాగార్జున అన్నారు. గురువారం స్థానిక మండలంలోని ఎస్ ఉప్పరపల్లిలో సర్పంచ్ ఆనాల కవితా చంగల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ కార్యక్రమాన్ని




నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ ఫినాయిల్ తదితర క్రిమిసంహారకమందులను మురికి గుంతల్లోనూ, మురికి కాలువలలోను చల్లాలని ఆయన గ్రామస్తులకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి గ్రామీణ ప్రాంతాలలో దోమలను అరికట్టే విధంగా ప్రజలకు సూచించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనాల చంగల్ రెడ్డి ,జడ్పిటిసి పాలెం కోట రత్నమ్మ పంచాయతీ సెక్రటరీ, డిడి ఓ రత్నరాజు హెల్త్ ఇన్స్పెక్టర్ శివ శంకర్ గౌడ్ గ్రామస్తులు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మునేశ్వరస్వామిని దర్శించుకున్న నారా భువనేశ్వరి

శాంతిపురం, సూర్య వాస్తవం: కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం శాంతిపురం మండల పరిధిలోని చీమనపల్లి గ్రామంలో పర్యటించారు.ఈ సందర్భంగా నారా భువనేశ్వరికి స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలు, పార్టీ కార్యకర్తలు, తెలుగు మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమెకు స్థానిక మునేశ్వర స్వామి ఆలయం వద్ద పూర్ణకుంభ కలశాలతో ఆలయ అర్చకులు ప్రత్యేక స్వాగతం



పలికారు. ఈసందర్భంగా మునేశ్వరస్వామికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు భువనమ్మకు తీర్థ, ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు.

## డెంగ్యూ వ్యాధితో జరభద్రం

### -మహిళకు సోకిన డెంగ్యూ వ్యాధి
### -అప్రమత్తమైన వైద్య సిబ్బంది.

పత్తికొండ (సూర్య వాస్తవం): పత్తికొండ సీజన్ వ్యాధులు పట్టణాల నుంచి గ్రామాలకు వ్యాపిస్తుండడంతో వైద్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయడానికి వైద్య సిబ్బంది అలర్ట్ చేశారు. డెంగ్యూ వ్యాధి సోకడంతో ఒకపక్క ప్రజలు ఆందోళన చెందుతుంటే మరోపక్క వైద్యులు అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తూ తగిన చర్యలు చేపట్టారు. గురువారం కర్నూలు జిల్లాలోని నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనిలో జీవిస్తున్న 28 ఏండ్ల మహాలక్ష్మికి డెంగ్యూ నిర్ధారణ కేసు నమోదు కావడంతో డాక్టరు సుజాత ఆధ్వర్యంలో కాలనీలో అరోగ్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఎవరికైనా జ్వరము వస్తే రక్తపరీక్షలుచేసి తగిన చికిత్సలు చేపట్టామని తెలిపారు. దోమల మందును పిచికారి చేయించామని చెప్పారు. ఇంటి ఇంటికి ఫీవర్ లార్వాల్ సర్వే నిర్వహించి లార్వా వున్న కంటైనర్లను తొలగించామని తెలియ జేశారు. పారిశుద్ధ్యపనులను శానిటరీ ఇన్స్పెక్టర్ మర్రిసామి చేయించారని తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పబ్లిక్ హెల్త్ నర్సు గంగరత్న అరోగ్య పర్యవేక్షకులు ప్రకాష్ వరలక్ష్మి ఎంఎల్ హెచ్ పి లు కరుణ అనిల్ కుమార్ ఆరోగ్యకర్యకర్త కళావతి శానిటరీ ఇన్స్పెక్టర్ మర్రి స్వామి పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అన్ని రంగాల్లో జిల్లాను టాప్-5 లో నిలపాలి

## ప్రైమరీ సెక్టార్ల అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప బ్యూరో సూర్యవాస్తవం

ప్రాధాన్యతా రంగాలను అన్నివిధాలా పటిష్టం చేసి రాష్ట్రంలో జిల్లాను టాప్-5 లో నిలపాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని గ్రీవిన్స్ సెల్ హాలులో జేసి అదితి సింగ్ తోకలిసి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, పనుల పురోగతి, సాధించిన ప్రగతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ శాఖ పరిధిలో జిల్లాలో ఖరీఫ్ సాగుబడిని పెంచడంతో పాటు అధిక దిగుబడులను సాధించేలా యాజమాన్య పద్ధతులను రైతులు పాటించేలా అవగాహన పెంచాలన్నారు. ప్రతి రైతు కూడా సాగుచేసే పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ తో పాటు ఈ-కేవైసి ప్రక్రియను పూర్తి చేయించాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రాల (ఆర్.ఎస్.కె.) ద్వారా వ్యవసాయ, ఉద్యాన రంగ సేవలను విస్తృతం చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ కు సరిపడా ఎరువులు, పురుగు మందులు కొరతలేకుండా నిల్వలు ఉంచాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డులను రైతులకు అందించడమే కాకుండా వారి అవసరాలకు అనుగుణంగా బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ శాఖలతో కలిపి సమ్మిళిత సాగుబడులను ప్రోత్సహించాలన్నారు.

అలాగే సాయిల్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్స్ (ఎస్.డబ్ల్యు.పి.సి.) నిర్వహణను పెంచాలన్నారు. జిల్లాలోని ఎఫ్.పి.ఓ. లను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో అధికారులు రైతులతో మమేకమై వారికి సలహాలు, సూచనలు అందించాలన్నారు. జిల్లాలో అధిక శాతం ఉద్యాన పంటలు సాగులో ఉండడంతో సంబంధిత అధికారులు ఆయా పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భవిష్యత్తులో ఉద్యాన శాఖ జిల్లాకు ప్రాథమిక ఆదాయ వనరుగా మారనుందనే ఆశాభావాన్ని జిల్లా కలెక్టర్ వ్యక్తం చేశారు. అరటి, బత్తాయి, మామిడి తోటల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఉద్యాన పంటల సాగుబడిని పెంపొందించేందుకు రైతుల్లో అవగాహన పెంచాయాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో ప్రవేశపెడుతున్న "న్యూట్రీ గార్డెన్స్" సాగుబడికి విద్యశాఖాధికారుల సమన్వయంతో మంచి ఫలితాలను తీసుకురావాలన్నారు. ఎపిఎంఐపీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సన్న చిన్నకారు రైతులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో వర్షపాతం సంతృప్తికరంగా నమోదు అయ్యే పరిస్థితులు తక్కువగా ఉండడంతో సూక్ష్మ సేద్యం ద్వారా సాగుబడి విస్తీర్ణాన్ని పెంపొందించాలన్నారు. ఆ దిశగా రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పశుసంవర్ధక శాఖను మరింత విస్తృతం చేస్తూ పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకందార్లను ఆర్థికంగా ముందుకు నడిపే సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు ఖచ్చితంగా ప్రభుత్వం కల్పిస్తున్న పశుభీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. సంచార పశువైద్య శాలల ద్వారా గ్రామస్థాయిలో సేవలను విస్తృతం చేయాలన్నారు. ఎక్కడా కూడా పశు




సంపదకు పశుగ్రాసం కొరత లేకుండా చూడాలన్నారు. పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. మార్క్ ఫెడ్ ద్వారా రైతులకు సీజన్ల వారీగా అవసరమైన అన్ని రకాల ఎరువులను, పెస్టిసైడ్స్ ను అన్ని రైతుసేవా కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న రైతు బజార్లు, మార్కెటింగ్ గిడ్డంగుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ద్వారా జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సజావుగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి, ఇతర రబీలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాల లక్ష్య సాధన కోసం సంబందిత బ్యాంకు కంట్రోలర్ల సంబందిత అధికారుల సమన్వయంతో చిత్తశుద్ధితో ముందుకు సాగాలన్నారు. జిల్లాలో ఔత్సహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహకాన్ని అందిస్తూ ఆయా రంగాల్లో నైపుణ్య శిక్షణతో పాటు, పెట్టుబడి మొత్తాన్ని అందించేందుకు సహకరించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి.. మండల స్థాయిలో స్థితిగతులను ఆయా అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడి రవీంద్రారెడ్డి, డిసిఓ సుభాషిణి, హార్టికల్చర్, సిరి కల్చర్, పశుసంవర్ధక శాఖ, ఫిషరీస్, మార్కెటింగ్, పరిశ్రమలు వివిధ ప్రాధాన్యత రంగాలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీలో ఊపందుకున్న రాజీనామాల పర్వం

కడప బ్యూరో సూర్య వాస్తవం:

ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడైన దాదాపు 40 రోజుల తర్వాత వైసీపీలో రాజీనామాల పర్వం ఊపందుకుంది. ఆ పార్టీలో



అసంతృప్తిగా ఉన్న నేతలు జగన్ నాయకత్వంపై విశ్వాసం లేని నేతలంతా వైసీపీకి గుడ్‌బై చెబుతున్నారు. గత వారం రోజులుగా జిల్లా స్థాయి నాయకులు ఎందరో వైసీపీకి దూరమవుతున్నారు. తాజాగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు వైసీపీకి రాజీనామా చేయగా తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలో కీలక నేతలు పార్టీకి దూరమవుతున్నారు. పార్టీ బలోపేతంపై వైసీపీ అధినేత జగన్ దృష్టిపెట్టకపోవడం, కిందిస్థాయి క్యాడర్‌ను పట్టించుకోకపోవడంతోనే వైసీపీ నాయకులు పార్టీని వీడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో జగన్ తీసుకుంటున్న నిర్ణయాలుసైతం నచ్చకపోవడంతోనే వైసీపీకి నేతలు గుడ్‌బై చెబుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ఇద్దరు కీలక నాయకులు వైసీపీకి రాజీనామా చేశారు. వాస్తవానికి చాలామంది నాయకులు వైసీపీని వదిలి ఇతర పార్టీల్లో చేరాలనే అభిప్రాయంతో ఉన్నప్పటికీ ఇతర పార్టీల నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో వెయిట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కసారి టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి సిగ్నల్ వస్తే మాత్రం వైసీపీ నుంచి భారీగా వలసలు ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఏలూరులో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆయనతో పాటు పార్టీ ఏలూరు జిల్లా కోశాధికారి, ఏలూరు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మంచెం మైబాబు కూడా రాజీనామా చేశారు. ఈ ఇద్దరు నేతలు గత కొంతకాలంగా వైసీపీలో కీలకంగా పనిచేశారు. ముఖ్యమైన ఇద్దరు నేతలు పార్టీని వీడటంతో వీరితో పాటు వీళ్ల అనుచరులు సైతం వైసీపీకి దూరం కానున్నారు. మరికొందరు సీనియర్లు సైతం జిల్లాలో వైసీపీకి రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ పార్టీ విధి,విధానాలు నచ్చకపోవడంతోనే శ్రీనివాస్, మైబాబు రాజీనామా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరు నేతల రాజీనామా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.



కడప జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటిని కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసిన సమాచార పౌర సంబంధాలశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎస్.మహబూబ్ బాషా ఆయనతోపాటు పౌర సంబంధాల శాఖ ఏడి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.
– కడప సూర్య వాస్తవం

## కాన గూడూరు గ్రామంలో చోరీ

దువ్వూరు, సూర్య వాస్తవం :

మండల పరిధిలోని కాన గూడూరు గ్రామంలో సురేంద్ర తండ్రి గరుడయ్య అనే



వ్యక్తి ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు 24వ తేదీ తమ ఇంట్లో చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్సై శ్రీనివాసులు క్లుజ్ టీం తో వెళ్లి జరిగిన ప్రదేశంలో వేలిముద్రలు పరిశీలించారు. ఫిర్యాదుదారుడు తమ ఇంట్లో 40 వేల రూపాయల బంగారు వస్తువులు, వెండి వస్తువులు పోయినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

# ఓడిఎఫ్ పల్స్ సర్వే వేగవంతం చేయండి

## -డిఎల్‌పిఓ సుమన జయంతి

నార్పల సూర్య వాస్తవం:

మండల వ్యాప్తంగా ఓడిఎఫ్ పల్స్ సర్వే వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ,సాంకేతిక సహాయకులకు డిఎల్పిఓ సుమన జయంతి సూచించారు.గురువారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఏసి రాముడు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు,సాంకేతిక సహాయకులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్పిఓ, ఎంపీడీఓ, ఈఓఆర్డి మాట్లాడుతూ నార్పల మండలం జిల్లాలోనే ఓడిఎఫ్ పల్స్ సర్వేలో వెనుకబడిందని మండలంలోని కార్యదర్శులు,సాంకేతిక సహకులు సచివాలయ ఉద్యోగులందరూ గూగుడు కుల్లాయ స్వామి బ్రహ్మోత్సవాల విధుల్లో ఉండడం వలన వెనక పడ్డారని ప్రస్తుతం కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాలు కూడా అందరి సహకారంతో విజయవంతంగా ముగిశాయని ఇప్పటి నుంచి సచివాలయ ఉద్యోగులందరూ సమన్వయంతో ఓడిఎఫ్ పల్స్ సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామపంచాయతీలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని, గ్రామంలోని ఓఆర్ఎస్ ట్యాంకులు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలన్నారు. ప్రస్తుతం వానల కాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రజలే అవకాశం ఉందని ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతాయని అన్ని గ్రామపంచాయతీలో ఫాగింగ్ మిషనులు అందుబాటులో ఉన్నాయని ప్రతి గ్రామపంచాయతీలో ఫాగింగ్ చేయించాలని తెలిపారు. అదేవిధంగా సచివాలయ ఉద్యోగులు పంచాయతీ కార్యదర్శులు గ్రామంలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకోవాలని తెలిపారు ప్రతి ఒక్క గ్రామ సచివాలయంలోనూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



ఫోటోలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఓఆర్డి శైలజా రాణి ,పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అంటూవ్యాధులు ప్రబలకుండా చర్యలు

కోడుమూరు (సూర్య వాస్తవం):

వర్షాల అనంతరం కోడుమూరులోని పలు ప్రాంతాల్లో చిత్తడిగా తయారై అపరిశుభ్రంగా ఉండటంతో చాపకింద నీరులా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. దీంతో గ్రామ పంచాయతీ అధికార యంత్రాంగం ముందస్తుగా అప్రమత్తమై పారిశుధ్య నిర్వహణకు పంచాయతీలో ఫాగింగ్ యంత్రాలు, స్ప్రే యంత్రాలతో దోమల మందును పిచికారి చేస్తున్నారు. నిత్యం మురుగు కాల్వల శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లడం, లోతట్టు ప్రాంతాల్లోని నీటి నిల్వలను తొలగించడం అంటువ్యాధులు సోకకుండా తగు చర్యలు చేపట్టారు.

## శింగనమల నియోజక వర్గంలో సాగు, తాగు నీటికి నిధులు మంజూరు చేయించండి

### - ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, మంత్రి నిమ్మల రామానాయుడును కోరిన శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

నార్పల సూర్య వాస్తవం: శింగనమల నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా ఉన్న సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ విన్నవించారు. గురువారం అసెంబ్లీ సమావేశ భవనంలో ఆమె



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని, మంత్రి నిమ్మల రామనాయుడుని, వేర్వేరుగా కలిసి నియోజకవర్గ సాగు, తాగు నీటి, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు గార్లదిన్నే మండలం పెనకచెర్లలోని యం.పి.ఆర్ డ్యాం ప్రధాన గేట్లు, ఐదవ డిస్ట్రిబ్యూటరీ కాలువ పనులపై క్షుణంగా తెలిపారు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. పుట్లూరు, యల్లనూరు మండల రైతులకు అవసరమైన సాగునీరు అందించే గండికోట కాలువ సమస్యను ఆమె తెలిపారు. సాగు తాగు నీటి సమస్య తీర్చేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఎంపీఆర్ డాం మరమ్మత్తులు, గండికోటను క్షేత్రస్థాయిలో స్థాయిలో ఈసమస్యలను పరిశీలించి నియోజకవర్గ రైతన్నల సాగునీటి, ప్రజల తాగునీటి సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి వివరించారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# స్కూల్ పిల్లలు స్కూల్ కి వెళ్ళని పరిస్థితి

## గెడ్డలోనే గిరిజనులతో కలసి నిరసన

అల్లూరి,జూలై25 :

అల్లూరి జిల్లా దేవరాపల్లి, వాలాబు పంచాయతీ చివారు బోర్రచింత గిరిజనులు జల దిగ్బంధనంలో చిక్కున్నారని సిపిఎం మండల కార్యదర్శి బిటి దోర పేర్కోన్నారు. గురువారం అతికష్టం మీద గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గిరిజనులతో కలిసి పారుతున్న గెడ్డలో నిరసన తెలిపారు.

అనంతరం అయిన మాట్లాడారు. గతవారం రోజులు నుండి కురుస్తున్న వర్షాలకు బోడ్డ గుమ్మి గెడ్డ ఉధృతంగా రావడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జలద్రిగ్బందంలో చిక్కుకోని నిత్యావసర వస్తువులు, విద్యా, వైద్యం అందక ముసలివారు, చిన్న పిల్లలు తీవ్ర అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని పూర్వకాలం నుండి గిరిజనులు పాలకులకు మోరపెట్టుకున్న పట్టించుకోవడం లేదన్నారు. గిరిజనులు పట్ల పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. దీంతో గిరిజనుల అభివృద్ధికి ఆమాడ దూరంలో ఉన్నారని అన్నారు. ఎన్నికల సమయంలో కనిపిస్తున్న పార్టీల నాయకులు , గిరిజనులు కష్టాల్లో ఉన్నప్పుడు ఎందుకు కనిపించడం లెదన్నారు.

అడవిలో జంతువులపై ఉన్న ప్రేమ కూడా గిరిజనులపై లెదన్నారు. ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని జలద్రిగ్బందలో చిక్కుకున్న గిరిజనులను ఆదుకోవాలని దోర డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మడుగు మచిరాజు, టుకూరు రాములు, ముర్ల పైడితల్లి, నూకరాజు, దేవరాజు, భీమరాజు, గణెలిష్, గ్రామ పెద్దలతో సహా తదితరులు పాల్గొన్నారు.

## సిద్దవటం రేంజ్ లో రెండు బృందాలు కూంబింగ్

సిద్దవటం సూర్య వాస్తవం: సిద్దవటం రేంజ్ లో రెండు బృందాలు గురువారం కూంబింగ్ నిర్వహించినట్లు కడప జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజర్ కే.ఎం నయీం అలీ మరియు సిద్ధవటం రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది, సిద్ధవటం రేంజ్ సిబ్బంది కలిసి రెండు స్పెషల్ టీమ్స్‌గా ఏర్పడి సిద్ధవటం





రేంజ్‌నందు నాలుగు బీట్లలలోని సమస్యాత్మక ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహించామన్నారు. ఎక్కడా ఎటువంటి స్మగ్లింగ్ ఆనవాళ్ళు కనిపించలేదని, ఈ కూంబింగ్ మరికొన్ని రోజులు కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కూంబింగ్ నందు గొల్లపల్లి డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఫారెస్ట్ బీటు అధికారులు నాగరాజు, గొల్లపల్లి పెంచల్ రెడ్డి, బేస్ క్యాంపు సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్స్ పాల్గొన్నారు.

## మీ పిల్లలకుఇలాంటి భోజనం పెడతారా: డీఈవో ఆగ్రహం

కదిరి, సూర్య వాస్తవం: మీ పిల్లలకు ఇలాంటి భోజనం పెడతారా అంటూ



మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులపై డీఈవో మీనాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కదిరి మున్సిపాలిటీలోని ఉర్దూ పాఠశాలను డిఇఓ తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ తనిఖీచేశారు. మధ్యాహ్న భోజనం పాఠశాల ఆవరణలోనే వండాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించకపోతే ఏజెన్సీని మార్చాల్సి వస్తుందనిహెచ్చరించారు. ఉర్దూ పాఠశాలలో టీచర్ల కొరత ఉండడంతో కుటాగుళ్ల హెచ్‌ఎం వరప్రసాద్‌ను ఇన్చార్జిగా నియమించడం తోపాటు ముగ్గురు ఉపాధ్యాయులను ఉర్దూ పాఠశాలకు కేటాయించారు.

## "ఆధార్ స్పెషల్ క్యాంప్స్" కార్యక్రమాలను పరిశీలించిన మండల అధికారులు

ఉరవకొండ, సూర్య వాస్తవం: మండల పరిధిలో గ్రామ సచివాలయం-2



బెలుగుప్ప మండలం లోని సీర్పి, కాలువపల్లి గ్రామ సచివాలయాలలో షెడ్యూల్ ప్రకారం గురువారం నిర్వహించబడుతున్న "ఆధార్ స్పెషల్ క్యాంప్స్"లను పరిశీలించిన మండల అధికారులు. తదనంతరం గ్రామ సచివాలయాలను తనిఖీచేసిన ఎంపీడీవో సుబ్బ రాజు, విస్తరణ అధికారులు చంద్ర మౌళి, మాధవ రెడ్డి, పరిపాలనా అధికారి జయ రాములు, హాజరైన పంచాయతి కార్యదర్శులు గౌస్ సాహెబ్, రవి కుమార్, పాండు, ఉమా దేవి, డిజిటల్ అసిస్టెంట్స్ తేజేష్, నూర్ బాషా, జగదీశ్వర్ నాయక్, గంగేశ్వర్, చంద్ర మోహన్ రాజు, ఉపేంద్ర, సచివాలయ సిబ్బంది. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లడుతూ ఆధార్ స్పెషల్ క్యాంప్స్ ఇంకా 2 రోజులు షెడ్యుల్ ప్రకారం నిర్వహించారు, ఈ అవకాశం ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్ ఊపిరి, జుబేర్

రైల్వేకోడూరు సూర్య వాస్తవం:

నూతనంగా ప్రవేశపెట్టిన బడ్జెట్ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు ఇచ్చిన బడ్జెట్లో 15 వేల కోట్లు మంజూరు చేయడం అత్యంత గొప్ప విషయమని రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకుడు జుబేర్ అన్నారు. స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంకోసం ప్రత్యేకంగా నిధులును కేటాయించడం ఐదుకోట్ల ప్రజలు హర్షించదగ్గ విషయమని జుబేర్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15 వేల కోట్ల రూపాయలు బడ్జెట్ ప్రవేశపెట్టడం వల్ల ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి అలాగే మన రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు చాలా గ్రామాలు వెనుకబడి ఉన్నాయని వాటిని అభివృద్ధి చేయడానికి దోహదపడతాయని ఆయన అన్నారు. ఓడరేవుల పరిరక్షణ , అభివృద్ధి పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తాననడం ఎంతో సంతోషించతగ్గ విషయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కమిటీ డెవలప్మెంట్ సభ్యులు అంకిపల్లి భువనేశ్వర్ మైనార్టీ నాయకులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# సినీ ఫక్కీలో మూడు కోట్లకు టోకరా

### -అధిక వడ్డీ ఆశ చూపి మండల ప్రజలను బురిడీ కొట్టించిన గజదొంగ

### -పోలీసులను ఆశ్రయించిన బాధితులు

నల్లచెరువు, సూర్య వాస్తవం:

అధిక వడ్డీ ఆశచూపి 3 కోట్లకు ఎసరువేసి నమ్మినవారికి కుచ్చుటోపి పెట్టిన ఓ ప్రబుద్ధుడి బాగోతం గురువారం మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం మండల కేంద్రంలో సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్లో చక్కెర, సిగరెట్స్ హోల్సేల్ ధరలకు సరఫరా చేస్తానంటూ ఉమామహేశ్వర్ రెడ్డి అను ఓ గుర్తుతెలియని వ్యక్తి దుకాణం ఏర్పాటు చేశాడు. మూడు నెలలపాటు మండలంలో కొంతమందితో పరిచయాలు పెంచుకున్నాడు. దుకాణం నడపటంతో పాటు హుందాగా రోజుకోక కారులో తిరగడం చేతినిండా బంగారు ఉంగరాలు ధరించడం దర్జాగా బ్రతకడం వంటివిచేసి మండల ప్రజలను అతనివైపు ఆకర్షితులు అయ్యేవిధంగా ప్రవర్తించాడు. దీనిని నమ్మిన మండల ప్రజలు అతని మాయలో పడిపోయారు.ఇదే అదునుగా చేసుకున్న ఉమామహేశ్వర్ రెడ్డి అధిక మొత్తంలో వడ్డీ చెల్లిస్తానంటూ ఆశ చూపి మండల కేంద్రంలోని పలువురి వద్ద లక్షల లక్షలు వసూలు చేశాడు. డబ్బులు వసూలు చేయడంతోపాటు అధికసంఖ్యలో గొర్రెలు, మేకల కాపురులకు కూడా వలవేశాడు. ఎండనక వాననక కష్టపడి గొర్రెల మేపుకుంటూ జీవనం సాగిస్తున్న రైతన్నలు సైతం ఈ బురిడీ మోసగాడి వలలోపడక తప్పలేదు. రైతన్నలను బురిడీ కొట్టించడానికి మండల పరిధిలోని పులిమివాండ్లపల్లికి చెందిన మండెం వెంకటరమణారెడ్డిని తన ఆయుధంగా వాడుకున్నాడు. మేకల కాపురులందరికీ వెంకటరమణారెడ్డి పరిచయస్తుడు కావడంతో బురిడీ కొట్టించడానికి ఆయనే సరైన వ్యక్తిగా ఎంచుకున్నాడు. చివరికి వెంకటరమణారెడ్డినే మధ్యవర్తిగా పెట్టుకుని మండల పరిధిలోని కదిరి పూలకుంట గ్రామానికి చెందిన బి. వెంకటరమణకు చెందిన రూ.12 లక్షల 45000 విలువచేసే 216 మేకలు, గాజేగానిపల్లి వాసి ఎస్.మస్తాన్ కు చెందిన రూ.4 లక్షల 32,500 విలువగల 52 గొర్రెలు, ఎనుములవారిపల్లి వాసి కె.ఆదెప్పకు చెందిన రూ9 లక్షలు విలువగల 116 మేకలు,కుంట్లవారి పల్లివాసి కే.అరుణమ్మకు చెందిన రూ.2లక్షల 50వేలు విలువగల 42 మేకలు,కమ్మవారిపల్లి వాసి బి. వెంకటరమణకు చెందిన రూ.2లక్షల 50వేలు విలువ గల 44 గొర్రెలు, మండల పరిధిలోని రాగన్నగారిపల్లి వాసి టి.నరేందర్ రెడ్డికి చెందిన రూ.2లక్షల 50వేలు విలువగల మేకలు, అదే గ్రామానికి చెందిన సి.శంకరకి చెందిన రూ.7లక్షల 25వేలు విలువగల మేకలను



కొనుగోలు చేసినట్లు బాదితులు వాపోయారు. ఇదేక్రమంలో మండలంలోని మరికొంతమంది వద్ద తన కుటుంబానికి సంబంధించి శుభకార్యం ఉందని ఆశుభకార్యానికి తన భార్య వేసుకోవడానికి నగలుకావాలని అడిగి తీసుకెళ్లినట్లు సమాచారం. ఉమామహేశ్వర్ రెడ్డికి నగలు అందజేసిన వ్యక్తులు బుధవారం దుకాణం వద్దకు వెళ్తే దుకాణం మూసివేసి ఉండడంతో అనుమానం మొదలైందని తెలుస్తోంది. దీంతో అతని బాగోతం బయటపడినట్లు మండల మొత్తంచర్చ మొదలైంది. ఈ విషయమై మధ్యవర్తిగా వ్యవహరించిన మండెం వెంకటరమణారెడ్డిపై బాధితులు అందరూ మండిపడుతున్నారు. వెంకట రమణారెడ్డి మాత్రం తను నాకు కూడా ఈ మధ్యలోనే పరిచయం అయ్యాడని హుందాగా వ్యవహరించడంతో మోసగాడు కాదని అనుకున్నానని అతనికి నాకు ఎటువంటి సంబంధం లేదని వాపోయాడు. కానీ అతను ఎక్కడున్నా పట్టుకుని అతని వద్ద నుండి ఎవరి సొమ్ము వారికి ఇప్పించే బాధ్యత నేను తీసుకుంటానని తెలిపారు. దీంతో వెంకటరమణారెడ్డితో పాటు బాధితులు అందరూ కలిసి స్థానిక పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అధికారులు రెవెన్యూ రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్ పి. సిసోడియా

### రెవెన్యూ అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

### అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

అన్నమయ్య సూర్య వాస్తవం

రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్ పి.సిసోడియా అధికారులకు సూచించారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన సందర్భంగా మదనపల్లెకు విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్ పి. సిసోడియా, అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, లతో కలిసి గురువారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలోని హెచ్ ఎన్ ఎస్ ఎస్ కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై మూడు జిల్లాల ఆర్డీవోలు, తహసిల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి.సిసోడియా మాట్లాడుతూ... రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని ప్రతి సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

ప్రజాస్వామ్యంలో రెవెన్యూశాఖ అత్యంత కీలకమైందని ప్రతి రెవెన్యూ ఉద్యోగి రెవెన్యూ రికార్డుల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రాబోయే రోజులలో ఏ రకమైన అవకతవకలకు పాల్పడకుండా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పక్కాగా రికార్డులు మెయింటినెన్స్ చేయాలన్నారు. 20 సంవత్సరాలు పూర్తి కాకముందే ఎక్కడ కూడా డి.పట్టా ఇవ్వకూడదని ఇలాంటి కేసులు ఏమైనా ఉన్నట్లయితే సర్వే చేయించాలన్నారు. తహసిల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తు ఆన్లైన్ చేయడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు ప్రతి చిన్న విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి సమస్య పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ...ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైందని ప్రతి రెవెన్యూ ఉద్యోగి రెవెన్యూ అంశాలలో పూర్తి అవగాహన బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన ఇనాం భూముల రిజిస్ట్రేషన్లు, 22(ఎ) భూ సమస్యలు, 2020-23 సంవత్సరంలో జరిగిన పట్టా భూముల వివరాలు, వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములకు కన్వర్షన్ చేయుట, చుక్కల భూముల సమస్యలు, అసైన్మెంట్ భూముల వివరాలు, తదితర అంశాలపై డివిజన్ల వారీగా ఆర్డీవోలు, తహసిల్దార్ లతో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, జిల్లాల ఆర్డీవోలు, తహసీల్దారులు, ఆర్ ఐలు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.



## అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు

### - జిల్లా ఎస్పీ రత్న

కదిరి, సూర్య వాస్తవం:

అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీసత్య సాయి జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. గురువారం కదిరి పట్టణ పోలీస్ స్టేషన్ను ఎస్పి తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాల పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. కదిరి ప్రాంతంలో యువకులు గంజాయి మత్తుకు లోనఅవుతున్నారని, పట్టణ శివారులలో బైక్ రైడింగ్ గురించి



తమ దృష్టికి వచ్చిందన్నారు. నేరాల నివారణకు సిబ్బందిని పెంచి, నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. తను ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పుట్టపర్తి, ధర్మవరం, పెనుగొండ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేయడం జరిగిందని, నేడు హిందూపురం పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక అవగాహన వచ్చేందుకు కొంత సమయం పడుతుందన్నారు. అనంతరం ఎస్పీ రత్న కదిరి పట్టణపోలీస్ స్టేషన్‌ను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అంతకుముందు జిల్లా ఎస్పీకి కదిరి డి.ఎస్.పి శ్రీలత, సిఐలు పుల్లయ్య, మోహన్ సిబ్బందితో కలిసి పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు.

## కీర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టూడెంట్స్ కి భగవద్గీత బుక్స్ పంపిణీ.

బంగారుపాళ్యం సూర్య వాస్తవం: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం తుంబకుప్పం గ్రామ హైస్కూల్ నందు కీర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భగవద్గీత బుక్స్‌ను అక్కడి స్టూడెంట్స్‌కి కీర్తి ఫౌండేషన్ చైర్‌పర్సన్ రాణి యాదవ్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో రాణియాదవ్



మాట్లాడుతూ పిల్లలు భగవద్గీత చదివి మంచి తెలివితేటలకు మంచి భవిష్యత్తుకు పునాది వేయాలని రాణి యాదవ్ కొనియాడారు

## అనంత జిల్లాను కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

### - కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

అనంతపురం టౌన్, సూర్య వాస్తవం:

అనంతపురం జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాల్లో గురువారం జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధిపై ఉన్న అపోహల గురించి ప్రజలకు అవగాహన కల్పించి కుష్టు వ్యాధి సోకిన ప్రతి వ్యక్తిని గుర్తించి చికిత్సలు అందించాలని వైద్య అధికారులను సిబ్బందిని ఆదేశించారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లాలో దాగి ఉన్న కుష్టి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో జులై 18 నుండి ఆగస్టు రెండు వరకు 15 రోజులు పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. సర్వేలు కుష్టి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందిస్తే ఆరు మాసాలలో పూర్తిగా నయమవుతుందన్నారు. జిల్లాలోని ప్రతి వ్యక్తి ని కుష్టు వ్యాధి పరీక్షలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పిల్లలకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. అలాగే సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించే కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను



ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఈబి. దేవి, జిల్లా లెప్రసి ఎయిడ్స్ మరియు టీబీ. జిల్లా అధికారి డా.అనుపమ జేమ్స్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి డా.శ్రీదేవి, డిపిఓ ప్రభాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## వరి నాట్లలో కాలి బాటలు వాటి ఉపయోగాలు తెలుసుకోవాలి

### -జిల్లా వ్యవసాయ అధికారి ఐతే నాగేశ్వరరావు

చెన్నూరు సూర్య వాస్తవం: రైతులు వరి నాట్లలో కాలిబాటలు వాటి యొక్క ఉపయోగాలు గురించి తెలుసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐతే నాగేశ్వరరావు తెలిపారు, గురువారం ఆయన మండలంలో సాగుచేసిన వరి పంటలను ఆయన సందర్శించి అక్కడ వరి నాట్లు చూసి వరిలో కాలి బాటలు వాటి యొక్క ఉపయోగాలను గురించి రైతులకు తెలియజేయడం జరిగింది, ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వరిలో నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు వెడల్పు కాలిబాటలు తూర్పు పడమర దిశలో తీసుకోవడం వలన తక్కువ ఖర్చుతో 3 నుంచి 4 బస్తాలు దిగుబడి అదనంగా పెరుగుటకు అవకాశం ఉందని తెలిపారు. వానా కాలంలో గాలి తూర్పు, పడమర దిశలో వీస్తుందని వరి పంటకు ఈగాలి వెలుతురు బాగా సోకి వరి పంట బాగా దుబ్బుగా ఎదగడానికి దోహదపడుతుంద ఆయన రైతులకు తెలియజేసారు, ఇలా చేయడం ద్వారా సుడిదోమ సోకకుండా మొక్క ఆరోగ్యవంతంగా పెరుగుతుందని రైతులు ఎరువులు వేయుటకు పురుగు మందులు పిచికారికి కూడా సులభతరంగా ఉంటుందని ఆయన రైతులకు వివరించారు, అంతేకాకుండా ఎలుకల బెడద నుండి కూడా తగ్గించుకోవచ్చునని ఆయన తెలిపారు,ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే శ్రీదేవి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ చరణ్ కుమార్ రెడ్డి, చెన్నూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా శీతల గంగమ్మ అమ్మవారి జాతర

### -మొక్కులు తీర్చుకున్న భక్తులు

సిద్దవటం, సూర్య వాస్తవం:

మండలంలోని మాధవరం-1 పంచాయతీ పరిదిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శీతల గంగమ్మ అమ్మవారి జాతర సందర్భంగా గురువారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భోనాలు సమర్పించారు. కొందరు భక్తులు అమ్మవారికి పూజలు చేసి కోడిపుంజులు, మేకపోతులను అమ్మవారికి బలిచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుంచే బారుతీరారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ముద్దపూజ, పుణ్యహావాచనం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, ఆకుపూజ, మహానైవేద్యం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయా, కర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. జాతర సందర్భంగా గ్రామస్తులు, నాయకులు బంధువులను, స్నేహితులను పిలుచుకొని విందు భోజనాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా తీసుకొని గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. జాతరలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఒంటిమిట్ట పురుషోత్తంరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్నలు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.



Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# సినిమా CINEMA



## జంధ్యాల మార్క్.. మారుతీనగర్ సుబ్రమణ్యం

దర్శకుడు లక్ష్మణ్ కార్య ఇంతకు ముందు 'హ్యాపీ వెడ్డింగ్' అనే సినిమాకి దర్శకత్వం వహించాడు. అయితే ఆ సినిమా ఆశించినంతగా నడవలేదు, కానీ లక్ష్మణ్ కార్య దర్శకత్వ పటిమ ఏంటో ఆ సినిమా ద్వారా తెలిసింది. అందుకే ఇప్పుడు రెండో సినిమాగా 'మారుతీనగర్ సుబ్రమణ్యం'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఈ సినిమాకి లక్ష్మణ్ కార్య దర్శకత్వంతో పాటు, రచన, మాటలు, స్క్రీన్ ప్లే కూడా అందించారు. ఈ




సినిమా త్వరలోనే విడుదలవుతుందని తెలుస్తోంది. అయితే ఈ సినిమా గురించి పరిశ్రమలో ఒక టాక్ బయలుదేరింది. అదేంటంటే ఈ సినిమాని ఇప్పటికే కొంతమంది పరిశ్రమలోని వారు చూసారని, ఈ సినిమా చూసిన తరువాత నవ్వకుండా ఉండలేరు అని అంటున్నారు. ఈ సినిమాలో రావు రమేష్ ప్రధాన పాత్ర పోషించారు. మామూలుగానే ప్రేక్షకులు ఒక సినిమాలో క్యారెక్టర్ పాత్రలో కనపడే రావు రమేష్ చెప్పిన మాటలని ఎంతో ఆస్వాదిస్తారు, అలాంటిది ఇప్పుడు అయన ప్రధాన పాత్రలో చేస్తున్న సినిమాలో అతని చెప్పే మాటలకి పడి పడి నవ్వాల్సిందే అని ఈ సినిమా చూసిన వాళ్ళు చెపుతున్నారు. ఇంకొక ఆసక్తికర అంశం ఏంటంటే ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీస్ మేకర్స్ కూడా చూసారని, అందుకే వాళ్ళు ఈ సినిమాని టేక్ అప్ చేసారని ఒక వార్త నడుస్తోంది. అలాగే

ఈ సినిమా ప్రముఖ దర్శకుడు సుకుమార్ కూడా చూసి ఎంతో ఆస్వాదించారని తెలుస్తోంది. ఇందులో రావు రమేష్ లాంటి నటుడికి ఒక ఫుల్ లెంగ్త్ రోల్ ఇస్తే తన మాటలతో ఎలా ప్రేక్షకులని మంత్రం ముగ్దుల్ని చేస్తాడో ఈ సినిమా నిరూపిస్తుంది అని కూడా అంటున్నారు. హింసాత్మక సినిమాలతో ప్రేక్షకుడికి ఊపిరి ఆడక ఉన్నటువంటి ఈ సమయంలో ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' ప్రాణవాయువు లాంటిదని అంటున్నారు. 'ఇది ఒక జంధ్యాల మార్కు సినిమాలా ఉంటుంది' అని ఈ సినిమా చూసిన వ్యక్తులు అంటున్నారు. దర్శకుడు జంధ్యాల సునిశితమైన హాస్యంతో తనదైన శైలితో ప్రేక్షకులను తన సినిమాలతో కడుపుబ్బా నవ్వించేవారు, ఇప్పుడు అలాంటి సినిమాలు కరువయ్యాయి, కానీ ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' సినిమాతో ఆ కరువు తీరిపోతుంది

## గూఢాచారి సీక్వెల్‌గా జీ2

టాలీవుడ్ హిస్టరీలో ల్యాండ్ మార్క్‌గా నిలిచిపోయే సినిమాల జాబితాలో ముందు వరుసలో ఉంటుంది గూడఛారి. అడివిశేష్ టైటిల్ రోల్ పోషించిన ఈ మూవీ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే ఫ్రాంచైజీలో ఈ చిత్రానికి కొనసాగింపుగా జీ2కూడా వస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మేజర్ సినిమాకు ఎడిటర్‌గా పనిచేసిన వినయ్ కుమార్ సిరిగినీడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా గన్స్ యాక్షన్ మూడ్‌లోకి దిగితే.. అంటూ డైరెక్టర్ వినయ్ కుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు మేకర్స్. వినయ్ కుమార్ చేతిలో పిస్తోల్ పట్టుకున్న తాజా స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన జీ2 (ఉ2) ఫస్ట్ లుక్ పోస్టర్‌తోపాటు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియో సినిమాపై సూపర్ క్యూరియాసిటీ పెంచుతోంది. షూటింగ్ కొనసాగుతున్నట్టు తెలియజేశారు. అడివి శేష్ ఈ మూవీలో మరోసారి స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్నట్టు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియోతో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా జీ2 చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు. జీ2 తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ విడుదల కానుంది.



## పుష్ప-2 ఆలస్యం అయినా ..అంచనాలు మించుతుంది

### నటుడు అల్లు శిరీష్ ఆసక్తికర కామెంట్స్




"పుష్ప-2 ఆసల్యం అయినా ప్రేక్షకుల అంచనాలను మాత్రం అందుకుంటుందని అల్లు శిరీష్ కామెంట్ చేశారు. తన సోదరుడు, నటుడు అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న 'పుష్ప 2' పై నటుడు అల్లు శిరీష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'పుష్ప 2' విడుదల ఆలస్యం కానుందంటూ జరుగుతోన్న ప్రచారంపై 'బడ్డీ' ప్రమోషన్స్‌లో స్పందించారు. సినిమా ఎప్పుడు వచ్చినా అభిమానుల అంచనాలను తప్పకుండా అందుకుంటుందన్నారు. 'పుష్ప 2'పై మీ ఉత్సాహాన్ని ఇలాగే కొనసాగించండి. డిసెంబర్ 6వ తేదీ లేదా ఎప్పుడు వచ్చినా ఆ సినిమా తప్పకుండా మీ అంచనాలు అందుకుంటుంది. ఇది మా అన్నయ్య సినిమా అని నేను ఈ విషయాన్ని చెప్పడం లేదు. సుకుమార్ చాలా అద్భుతంగా దీనిని చెక్కుతున్నారని ఫిల్మ్‌నగర్‌లో మాట్లాడుకుంటుంటే అది నావరకూ వచ్చింది. దానినే మీతో పంచుకుంటున్నా' అంటూ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు. అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన యాక్షన్ డ్రామా మూవీ 'పుష్ప ది రైజ్'. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఇది తెరకెక్కింది. సుకుమార్ దర్శకుడు. రష్మిక కథానాయిక. దీనికి కొనసాగింపుగా 'పుష్ప ది రూల్' సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. తొలుత దీనిని ఆగస్టు 15న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించినప్పటికీ.. కొన్ని అనివార్య కారణాల వల్ల డిసెంబర్ ఆరో తేదీకి వాయిదా వేశారు. మరోవైపు, 'ఊర్వశివో రాక్షసివో' తర్వాత అల్లు శిరీష్ నటించిన చిత్రం 'బడ్డీ'. స్టూడియో గ్రీన్ పతాకంపై తెరకెక్కింది. గాయత్రి భరద్వాజ్, గోకుల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సామ్ ఆంటోన్ దర్శకత్వం వహించగా.. కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఆగస్టు 2న విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లోని పలు నగరాల్లో ఇప్పటికే ప్రీమియర్స్ వేయగా మంచి టాక్ లభించింది.

## నారా రోహిత్ సుందరకాండ

నారా రోహిత్ హీరోగా వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో 'సుందరకాండ' చిత్రం తెరకెక్కుతుంది. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి ఈ ఫన్ ఫిల్డ్ రోమ్-కామ్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈచిత్రం షూటింగ్‌లో బిజీగా ఉన్నారు నారా రోహిత్. అయన నటిస్తున్న 20వ చిత్రమిది. నేడు నారా రోహిత్‌కి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో రోహిత్ ఇన్నోసెంట్ లుక్స్‌లో కూల్ డ్రెస్‌లో క్లాసీ, ఛార్మింగ్ గా కనిపించారు. చక్కని ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతుందని మేకర్స్ తెలిపారు. త్వరలో టీజర్‌ను త్వరలో విడుదల చేయనున్నారు. నారా రోహిత్ సరసన విర్తి వాఘని హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీ దేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రదీప్ ఎమ్ వర్మ సినిమాటోగ్రఫీ అందించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు.




Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in




# ఆటలు SPORTS



## పారిస్ ఒలింపిక్స్‌లో అద్భుతం..

### జ్యోతి పట్టుకుని వీధుల్లో నడిచిన పారాలింపిక్స్ కెవిన్ పియెట్



మరికొన్ని గంటల్లో పారిస్ లో ఒలింపిక్స్ సంబరాలు మొదలు కానున్నాయి. వేసవి ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకకు ముందు చాలా మంది ప్రసిద్ధ ఆటగాళ్లు ప్యారిస్ వీధుల్లో టార్చ్‌లతో పరుగెత్తడం కనిపించింది. ఆ ఆటగాళ్ళలో ఫ్రెంచ్ టెన్నిస్ స్టార్ కెవిన్ పియెట్ ఒకడు. అతను నడవలేడు. 10 ఏళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం తర్వాత ఈ ఫ్రెంచ్ టెన్నిస్ స్టార్ నడవగలిగే శక్తిని కోల్పోయాడు. అయినప్పటికీ.. కాళ్లు పోయినంత మాత్రాన.. నడవ లేనంత మాత్రాన జీవితం అంతటితో ఆగిపోదు అంటూ పది మందికి ఉదాహరణగా నిలిచాడు ఫ్రెంచ్ టెన్నిస్ స్టార్. చేతిలో టార్చ్ పట్టుకుని పారిస్ వీధుల్లో పరుగులు తీస్తూ కనిపించాడు. నడవని వ్యక్తి పరుగులు తీయడం అనే అద్భుతం ఎలా జరిగింది అనేది ప్రశ్న. ప్రపంచం అభివృద్ధి చెందుతున్న కొద్దీ.. సాంకేతికంగా విభిన్న రీతిలో సామర్థ్యం పొందుతోంది. కెవిన్ పియెట్ కూడా ఒక టెక్నిక్ సహాయంతో పారిస్ ఒలింపిక్స్ టార్చ్ మార్చ్‌లో పాల్గొన్నాడు. ఒలింపిక్ టార్చ్‌తో పరుగెత్తడానికి.. అతను రోబోటిక్ ఎక్సోస్కెలిటన్‌ను ఉపయోగించాడు. కెవిన్ ఇంతకుముందు నుంచి కూడా ఈ పద్ధతిని ఉపయోగిస్తున్నాడు. కెవిన్ పియెట్ కూడా రోబోటిక్ ఎక్సోస్కెలిటన్ ద్వారా పారిస్ ఒలింపిక్స్ టార్చ్ రిలేలో పరుగెత్తడం ద్వారా చరిత్ర సృష్టించాడు. వాస్తవానికి, అతను ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరిగెత్తిన మొదటి అథ్లెట్ అయ్యాడు. కెవిన్ పియెట్ తన ఎక్సోస్కెలిటన్‌తో ఒలింపిక్ జ్యోతిని మోసుకెళ్లి చరిత్ర సృష్టించాడు/. ఫ్రెంచ్ పారాలింపిక్స్ టెన్నిస్ స్టార్ కెవిన్ పీట్ పారిస్‌లో చేసిన ఫీట్%ో% అతని ధైర్యం.. ఇతర దివ్యాంగులతో పాటు ఇతర పారా క్రీడాకారులకు ఒక ప్రేరణగా నిలుస్తుంది. ఇప్పుడు, మరికొందరు దివ్యాంగ ఆటగాళు తదుపరి ఒలింపిక్స్‌లో టార్చ్ మార్చ్‌లో భాగం అయ్యే చాన్స్ ఉంది అందడంలో ఎటువంటి సందేహం లేదు.. ఆశ్చర్య పడాల్సిన అవసరం అసలే ఉండదు. రోబోటిక్ ఎక్సోస్కెలిటన్ వికలాంగులు లేదా వృద్ధులు నడవడానికి సహాయపడుతుంది. ఇది వైకల్యాన్ని పూర్తిగా తొలగించదు కానీ అది వారిని స్వావలంబనగా మారేలా చేస్తుంది. కెవిన్ పియెట్ కూడా రోబోటిక్ ఎక్సోస్కెలిటన్ సహాయంతో టార్చ్ రిలేలో ఇలాంటి స్వీయ-విశ్వాసాన్ని చూపించాడు.



## బిజీగా ఉన్నా.. నాకు మెసేజ్ చేశాడు!

బాగా ఆడావ్ అని.. సీనియర్ నుంచి ఓ మెసేజ్ వస్తే జూనియర్‌కు అంతకంటే ఆనందం మరొకటి ఉండదు. గాల్లో తేలిపోతుంటాడు. అలాంటి ఆనందం, సంతోషమే తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి అనుభవించాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నితీశ్.. ఐపీఎల్ 2024 ముగిసిన తర్వాత టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా నుంచి ఓ మెసేజ్ వచ్చిందని గుర్తు చేసుకున్నాడు.

తాను మెసేజ్ చూసి షాక్ అయ్యానని చెప్పాడు. గాయం నుంచి కోలుకుంటున్న తాను దులీప్ ట్రోఫీ కోసం సన్నద్ధమవుతున్నానని చెప్పాడు. 'ఐపీఎల్ 2024 ముగిసిన తర్వాత హార్దిక్ పాండ్యా నుంచి ఓ మెసేజ్ వచ్చింది. నేను షాక్ అయ్యాను. బాగా ఆడావ్ అని ప్రశంసించాడు. ఇదే ఇంటెంట్, ఎనర్జీతో ముందుకు కొనసాగాలని సూచించాడు. ఎప్పుడూ ఆటను గౌరవిస్తూ ఉండలన్నాడు. త్వరలోనే నాతో మాట్లాడతానని మెసేజ్ చేశాడు. టీ20 ప్రపంచకప్ 2024 కోసం సన్నద్ధమవుతూ.. ఫుల్ బిజీగా ఉన్న తరుణంలో నాకు మెసేజ్ పంపడంతో ఆశ్చర్యమేసింది. ఆ మెసేజ్‌కు థాంక్యూ అని రిప్లై ఇచ్చా' అని నితీశ్ కుమార్ రెడ్డి తెలిపాడు. ఆల్‌రౌండర్‌గా ఎదిగేందుకు బెన్ స్టోక్స్, హార్దిక్ తనకు ఆదర్శమని చెప్పాడు. ఐపీఎల్ 2024లో నితీశ్ కుమార్ రెడ్డి రాణించిన విషయం తెలిసిందే. సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. 21 ఏళ్ల నితీశ్ 11 ఇన్నింగ్స్‌లలో 303 రన్స్ చేశాడు. అంతేకాదు మూడు వికెట్స్ కూడా పడగొట్టాడు. ఐపీఎల్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేయడంతో నితీశ్ రెడ్డికి భారత జట్టులో అవకాశం వచ్చింది. జింబాబ్వేతో ఐదు టీ20ల సిరీస్‌కు అతడు ఎంపికయ్యాడు. అయితే గాయం కారణంగా వైదొలగాల్సి వచ్చింది.

## సీఎస్‌కే తరఫున ఆడాకే గుర్తింపు వచ్చింది..

ఐపీఎల్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తరఫున ఆడాకే తనకు గుర్తింపు వచ్చిందని శ్రీలంక యువ పేసర్ మతీశా పతిరన తెలిపారు. చెన్నై తరఫున ఆడటం దేవుడిచ్చిన బహుమతిగా భావిస్తున్నా అని తెలిపాడు. క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనీతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం తన అదృష్టం అని పతిరన పేర్కొన్నాడు. యువ మలింగగా గుర్తింపు పొందిన పతిరన.. చెన్నై తరఫున ఐపీఎల్‌లోకి అడుగుపెట్టాడు. అనతికాలంలోనే సీఎస్‌కే కీలక బౌలర్‌గా ఎదిగాడు. దీంతో అతడికి శ్రీలంక టీమ్‌లో చోటు దక్కింది. టీ20 ప్రపంచకప్ 2024లో పతిరన ఫర్వాలేదనిపించాడు. భారత్‌తో మూడు టీ20ల సిరీస్ కోసం మతీశా పతిరన సిద్ధమవుతున్నాడు. ఈ సందర్భంగా ఐపీఎల్‌లో ఆడటంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'అండర్-19 తర్వాత ఏ జట్టులో కూడా నాకు చోటు దక్కలేదు. ఐపీఎల్‌లో చెన్నై తరఫున ఆడాక జాతీయ జట్టులో అవకాశం వచ్చింది. చెన్నై తరఫున ఆడటం దేవుడు ఇచ్చిన బహుమతిగా భావిస్తా. సీఎస్‌కేలో ఆడకముందు వరకు నా గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. ధోనీతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్న తర్వాత.. చెన్నై ఆడిన ప్రతీ మ్యాచ్‌లో సత్తా చాటేందుకు ప్రయత్నించా. ఆ తర్వాత గుర్తింపు లభించింది. నాలాంటి కుర్రాళ్లకు ధోనీతో పరిచయం చాలా ప్రత్యేకం' అని పతిరన అన్నాడు. 'నా బౌలింగ్‌ను చూసి చాలా మంది డెత్ ఓవర్లలో అద్భుతంగా వేస్తున్నావని ప్రశంసించారు. కొత్త బంతితో పాటు మిడిల్ ఓవర్లలోనూ మెరుగైన బౌలర్‌గా మారాలి. కొత్త బంతితో స్వింగ్ రాబట్టగలిగితే.. నాకే కాదు నేను ఆడే జట్టుకూ మంచి జరుగుతుంది. ఇందుకోసం తీవ్రంగా ఆలోచించట్లేదు. నిలకడగా ఒకేచోట బంతిని వేయడంపై దృష్టి సారిస్తా. సరైన లెంగ్త్‌తో పాటు స్వింగ్ రాబడితే చాలు. అంతకు మించి నాకేం అవసరం లేదు' అని మతీశా పతిరన చెప్పాడు.



## బ్రియాన్ లారా క్షమాపణలు చెప్పాల్సిందే..

వెస్టిండీస్ మాజీ కెప్టెన్ బ్రియాన్ లారాకు సంబంధించి కొత్త వివాదం తెరపైకి వచ్చింది. ఇద్దరు మాజీ క్రికెటర్లు వివ్ రిచర్డ్స్, కార్ల్ హూపర్‌లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. దీంతో బ్రియాన్ లారాకు వ్యతిరేకంగా వివ్ రిచర్డ్స్ విమర్శలు గుప్పించారు. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి, బ్రియాన్ లారా తను రాసిన పుస్తకం 'లారా, ది ఇంగ్లాండ్ క్రానికల్స్'తో ప్రస్తుతం వార్తల్లో నిలిచారు. ఈ పుస్తకంలో, అతను ఇద్దరు మాజీ వెస్టిండీస్ ఆటగాళ్ళు, వివ్ రిచర్డ్స్, కార్ల్ హూపర్ గురించి కీలక వ్యాఖ్యలు చేశాడు. అయితే ఈ విషయం ఈ ఇద్దరు క్రికెటర్లకు అస్సలు నచ్చలేదు. బ్రియాన్ లారా తన పుస్తకంలో కార్ల్ హూపర్‌పై వివ్ రిచర్డ్స్ చాలా దూకుడుగా ప్రవర్తించాడని, అతనిని వేధించేవాడని ఆరోపించారు. ఇది కాకుండా, రిచర్డ్స్ తనను 3 వారాలకు ఒకసారి వేధించేవాడని లారా తెలిపాడు. ఈ మేరకు లారా తన పుస్తకంలో రాసుకొచ్చాడు. వివ్ రిచర్డ్స్ ప్రతి మూడు వారాలకు నన్ను ఏడిపించేవాడు. ప్రతి వారం కార్ల్ హూపర్‌ని



ఏడిపించేవాడు. వివ్ రిచర్డ్స్ స్వరం చాలా భయానకంగా ఉంటుంది. మీరు మానసికంగా దృఢంగా లేకుంటే, మీరు దానిని మీరే తీసుకోలేరు. అది నాపై ఎప్పుడూ ప్రభావం చూపనప్పటికీ. నేను ఈ విషయాన్ని స్వాగతించాను. కానీ, కార్ల్ హాప్పర్ మాత్రం వివ్ రిచర్డ్స్‌కు దూరంగా ఉన్నాడు వివ్ రిచర్డ్స్ ఈ ఆరోపణలతో లారాపై కోపంగా ఉన్నారు. వెంటనే తన ప్రకటనపై క్షమాపణ చెప్పాలని బ్రియాన్ లారాను కోరాడు. కార్ల్ హాప్పర్ పట్ల సర్ వివియన్ రిచర్డ్స్ దూకుడుగా ప్రవర్తించాడని చెప్పడం పచ్చి అబద్ధం. ఈ ప్రకటనలు వివ్ రిచర్డ్స్‌ను నేరస్థుడిగా చూపిస్తున్నాయి. బ్రియాన్ లారా ఈ వాదన పూర్తిగా నిరాధారమైనది. అతని ప్రకటనతో ఇద్దరం తీవ్రంగా గాయపడ్డాం. బ్రియాన్ లారా తన ప్రకటనలను బహిరంగంగా ఉపసంహరించుకోవాలని, హృదయపూర్వకంగా క్షమాపణ చెప్పాలని మా డిమాండ్ చేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG,ON BEHALF OF IRS PUBLICATIONS.13-2-819-2 RAMBOW RESIDENCE,RTC BUS STAND ROAD. SRINIVASA NAGAR ANANTAPUR,ANDHRA PRADESH-515001. GSTIN:37AAJF15233N1ZY.TEL:7672042522.VIJ ADDRESS:SHEETAL APARTMENT,TF2 DR NO:39-2-15/IE VIJAYAWADA-10.CHIEF EDITOR MD. SHAFEE AHAMED, MOB NO:9948461699.-EDITOR-M.IRSHAD BAIG.CELL: 918500425222 (FOUNDER- N.ARIF ALI).